తెలంగాణ పేపర్

తెలుగు దినపత్రిక

భోగాపురం ఎయిర్‌పోర్ట్.. తొలి ఫ్లైట్ వచ్చేసింది

విశాఖపట్నం: భోగాపురం అల్లూరి సీతారామరాజు ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్ నుంచి విమాన సర్వీసులు ప్రారంభం అయ్యాయి. హైదరాబాద్ నుంచి వచ్చిన తొలి విమానం కాసేపటి క్రితం అక్కడ ల్యాండ్ అయింది. ఆ ఇండిగో 6ఈ 6408 ఫ్లైట్ను అధికారులు ఘనస్వాగతం పలికారు. ఉదయం 7.30 గంటలకు అదే విమానం భోగాపురం నుంచి హైదరాబాద్కు బయల్దేరనుంది. 8 గంటలకు బెంగళూరు, 8.20 గంటలకు కు ఢిల్లీ, 8.50గంటలకు గోవాకు విమానాలు వెళ్లనున్నాయి

హైదరాబాద్ సంపుటి: 13 సంచిక : 268 | సంపాదకులు : నస్రీన్ ఖాన్ | మంగళవారం,ఆగస్టు 18, 2026 | పేజీలు : 8 వెల : రూ. 2/-

భాజపా జాతీయ ఉపాధ్యక్షురాలిగా పురందేశ్వరి.. కాషాయ దళం కొత్త టీమ్ ఇదే



భాజపా నూతన జాతీయ కార్యవర్గాన్ని ప్రకటించింది. 13 మంది జాతీయ ఉపాధ్యక్షులతో పాటు వివిధ కీలక పదవులకు ఎంపిక చేసిన వారి జాబితాలను విడుదల చేసింది. భాజపా జాతీయ ఉపాధ్యక్షుల జాబితాలో కేంద్ర మాజీ మంత్రి, ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి (ఆంధ్రప్రదేశ్), మాజీ సీఎం వసుంధర రాజే సింధియా(రాజస్థాన్)తో పాటు తీరథ్ సింగ్ రావత్ (ఉత్తరాఖండ్), రామ్ మాధవ్ (దిల్లీ), బైజయంత్ జయ్ పాండా (ఒడిశా), రేఖా వర్మ, వర్షాబెన్ నరేంద్రభాయ్ దోషీ (గుజరాత్), డాక్టర్ భారతీ ప్రవీణ్ పవార్ (మహారాష్ట్ర), సర్దార్ మన్‌ప్రీత్ సింగ్‌బాదల్ (పంజాబ్), లాల్ సింగ్ ఆర్య (మధ్యప్రదేశ్), ప్రొఫెసర్ ఎం.నాగరాజ (కర్ణాటక), ప్రొఫెసర్ తారిఖ్ మన్సూర్ (ఉత్తర్‌ప్రదేశ్), డాక్టర్ మధుచంద్ర కర్ (పశ్చిమబెంగాల్) చోటు దక్కించుకున్నారు. వీరంతా భాజపా జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్ సారథ్యంలో పనిచేయనున్నారు. అలాగే, కేంద్ర మాజీమంత్రి స్మృతి ఇరానీ జాతీయ ప్రధాన కార్యదర్శుల్లో ఒకరిగా నియమితులై పార్టీలోని కీలకమైన సంస్థాగత బాధ్యతల్లోకి తిరిగి వచ్చారు.

భాజపా కొత్త టీమ్ ఇదే..

పార్టీ ప్రధాన కార్యదర్శి (సంస్థాగత): బీఎల్ సంతోష్ (దిల్లీ)

జాతీయ సంయుక్త ప్రధాన కార్యదర్శులు: శివ్‌ప్రకాశ్ (ముంబయి), సౌదన్ సింగ్ (చండీగఢ్)

జాతీయ ప్రధాన కార్యదర్శులు: వినోద్ తావ్డే (మహారాష్ట్ర), సునీల్ బన్సాల్ (దిల్లీ), బిప్లబ్ కుమార్ దేబ్ (త్రిపుర), స్మృతి ఇరానీ (ఉత్తర్‌ప్రదేశ్), డా.సతీష్ పూనియా (రాజస్థాన్), గజేంద్ర పటేల్ (మధ్యప్రదేశ్), హరీష్ ద్వివేది (ఉత్తర్‌ప్రదేశ్), సంజయ్ భాటియా (హరియాణా)

జాతీయ కార్యదర్శులు: కవిత పటిదార్ (మధ్యప్రదేశ్), సురేంద్రన్ (కేరళం), డా.భోలా సింగ్ (ఉత్తర్‌ప్రదేశ్), డా ప్రదీప్ వర్మ (ఝార్ఖండ్), జగదీశ్ ఈశ్వర్‌భాయ్ పటేల్ (గుజరాత్), డా సందీప్ పాఠక్ (దిల్లీ), ఫాంగ్నాన్ కొన్యాక్ (నాగాలాండ్), సంగీత యాదవ్ (ఉత్తర్‌ప్రదేశ్), అనిల్ ఆంటోనీ (కేరళం), డా ఎం.వెంకటేశన్ (తమిళనాడు), మనోజ్ తిగ్గ (పశ్చిమబెంగాల్), సిద్ధార్థ్ శంభు (బిహార్), డా.స్వదేశ్ సింగ్ (దిల్లీ), మృగంకా దేవ్ బర్మన్ (అస్సాం), రోహన్ గుప్తా (గుజరాత్), జయప్రకాశ్ (దిల్లీ)

జాతీయ కోశాధికారి: పీయూష్ గోయల్ (మహారాష్ట్ర)

జాతీయ సంయుక్త కోశాధికారి: రాజేశ్ మంగల్ (రాజస్థాన్)

సెంట్రల్ ఆఫీస్ ఇన్‌ఛార్జి: తరుణ్ చుగ్ (పంజాబ్)

సెంట్రల్ ఆఫీస్ కార్యదర్శి : మహేంద్ర పాండే (ఉత్తరాఖండ్)

నార్త్ ఈస్ట్ కోఆర్డినేటర్- డా సంబిత్ పాత్రా (ఒడిశా)

నార్త్ ఈస్ట్ జాయింట్ కోఆర్డినేటర్ – రాజీవ్ బబ్బర్ (దిల్లీ)

ఆల్ సెల్స్ కోఆర్డినేటర్: విష్ణుదత్ శర్మ (మధ్యప్రదేశ్)

ఆల్ సెల్స్ జాయింట్ కోఆర్డినేటర్స్: రితురాజ్ సిన్హా (బిహార్), విష్ణువర్ధన్ రెడ్డి (ఆంధ్రప్రదేశ్)

మోర్చా ప్రెసిడెంట్స్:

యువమోర్చా: డా.హేమాంగ్ జోషి (గుజరాత్)

మహిళా మోర్చా : రూప్ కుమారి చౌధరి (ఛత్తీస్‌గఢ్)

ఓబీసీ మోర్చా : అమర్‌పాల్ మౌర్య (ఉత్తర్‌ప్రదేశ్)

కిసాన్ మోర్చా – బన్సీలాల్ గుర్జర్ (మధ్యప్రదేశ్)

ఎస్సీ మోర్చా : శివేష్ కుమార్ రామ్ (బిహార్)

ఎస్టీ మోర్చా : డా మన్నాలాల్ రావత్ (రాజస్థాన్)

మైనార్టీ మోర్చా – కున్వర్ బాసిత్ అలీ (ఉత్తర్‌ప్రదేశ్)

మీడియా కన్వీనర్: అనిల్ బలూని (ఉత్తరాఖండ్)

మీడియా కో-కన్వీనర్లు: ఆశీష్ ఉషా అగర్వాల్ (మధ్యప్రదేశ్), ప్రదీప్ భండారి (దిల్లీ), సిద్ధార్థ్ యాదవ్ (దిల్లీ)

సోషల్ మీడియా కన్వీనర్: దీపక్ మస్కే (ఛత్తీస్‌గఢ్)

సోషల్ మీడియా కో-కన్వీనర్లు: ప్రీతి గాంధీ (మహారాష్ట్ర), శివానంద్ ద్వివేది (దిల్లీ), అలోక్ భట్ (ఉత్తరాఖండ్), అరుణ్ యాదవ్ (హరియాణా)

మరోవైపు, త్వరలోనే కేంద్రమంత్రివర్గ పునర్వ్యవస్థీకరణ జరగనున్నట్లు కేంద్రమంత్రి రామ్‌దాస్ అఠవాలే వెల్లడించారు. భాజపా, మిత్రపక్షమైన ఎన్‌సీపీకి చెందిన కొత్త వారిని మంత్రివర్గంలోకి తీసుకుంటారనే ప్రచారం జరుగుతోంది. సంస్థాగత మార్పులు చేసిన నేపథ్యంలో కొత్తవారికి చోటు దక్కే అవకాశాలు ఉన్నట్లు సమాచారం. తాజాగా ప్రకటించిన జాతీయ కార్యవర్గం, ఇతర ముఖ్య పదవుల్లో తెలంగాణ నుంచి ఎవరికీ చోటు దక్కకపోవడం గమనార్హం.

భూదాన్ భూములు సర్వే నెంబర్ లో ఎక్కడ ఉన్నాయో అధికారులు తేలుస్తారు: పొంగులేటి

హైదరాబాద్: ప్రజల ఆస్తులను ఆటంకం కలిగించాలని తమ ప్రభుత్వానికి లేదని మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి తెలిపారు. 22ఎ పై మేడ్చల్ జిల్లా నుంచి 511 అప్లికేషన్లు వచ్చాయని అన్నారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ.. 511లో 320 అప్లికేషన్లు యుఎల్ సికి సంబంధించినవని, వచ్చిన వాటిలో మెజార్టీ అప్లికేషన్లు నిజమైనవేనని తెలియజేశారు. గతంలో కూడా ఈ భూములు ప్రొహిబిటెడ్ లిస్ట్ లోనే ఉన్నాయని, అధికారుల పొరపాటు ఉందని పొంగులేటి అన్నారు. అంతకు ముందు ఇచ్చిన జీవోలను డిలీట్ చేయాల్సి ఉండాల్సింది కానీ చేయలేదని, అందుకే మళ్లీ సమస్య వచ్చిందని..దానిని కరెక్టు చేస్తున్నామని పొంగులేటి పేర్కొన్నారు. ప్రైవేట్ భూమిని 22ఎలో పెట్టారని 757 మంది దరఖాస్తు చేసుకున్నారని, ఈ



అంశంపై సుదీర్ఘంగా చర్చించామని అన్నారు. రంగారెడ్డి జిల్లాలో కూడా భూదాన్ భూముల అంశంలో ఇబ్బంది పడ్డారని, భూదాన్ భూములు సర్వే నెంబర్ లో ఎక్కడ ఉన్నాయో అధికారులు తేలుస్తారని పొంగులేటి చెప్పారు. వీలైనంత త్వరగా సమస్య పరిష్కరిస్తామని, బహిరంగ వేలం నిర్వహించిన ప్రాపర్టీలు ఆన్ లైన్ లో ప్రాపర్టీలు ఆన్ లైన్ లో లేవని, అవి కూడా ప్రొహిబిటెడ్ లిస్ట్ లోకి వచ్చాయని అన్నారు. వాటికి సంబంధించిన జీవోలు అప్ లోడ్ చేశామని, ఇకపై ఆ సమస్య ఉండదని హామీ ఇచ్చారు. ఒక అప్లికేషన్ ఇస్తే..3 నుంచి 5 రోజుల్లో సమస్య పరిష్కారం అవుతుందని, సమస్యను పరిష్కరించడం తన బాధ్యత అని ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని పొంగులేటి శ్రీనివాస రెడ్డి భరోసా ఇచ్చారు.

ఆటో కార్మికుల ఉపాధికి పూర్తి రక్షణగా రాష్ట్ర ప్రభుత్వం-మంత్రి పొన్నం

హైదరాబాద్,మినిస్టర్ క్వార్టర్స్లో తెలంగాణ కేకేసీ యూనియన్ ప్రతినిధులు మంత్రి పొన్నం ప్రభాకర్ను కలిసారు. ఆటో కార్మికులు ఎదుర్కొంటున్న వివిధ సమస్యలను మంత్రి దృష్టికి తీసుకువచ్చారు.మంత్రి మాట్లాడుతూ ఆటో కార్మికుల సమస్యల పరిష్కారానికి మా ప్రభుత్వం కట్టుబడి ఉంది. వారి సంక్షేమం కోసం త్వరలోనే సంక్షేమ బోర్డు ఏర్పాటు చేస్తాం. ఆటో ఛార్జీల పెంపు కోసం ఆటో కార్మిక సంఘాలు విజ్ఞప్తి చేస్తున్నాయి. 2012లో ఛార్జీలు పెరిగాయి. దాదాపు 14 సంవత్సరాలుగా ఛార్జీల పెంపు జరగలేదు. పెరిగిన పెట్రోల్, డీజిల్ ధరలు, వాహనాల ధరలు, నిర్వహణ ఖర్చులను దృష్టిలో పెట్టుకొని వారి ఇబ్బందులను ప్రభుత్వం పరిగణనలోకి తీసుకుంటుంది. అయితే ప్రయాణికులపై అదనపు భారం పడకుండా అన్ని అంశాలను క్షుణ్ణంగా పరిశీలించి ఛార్జీల పెంపుపై నిర్ణయం తీసుకుంటామని



అన్నారు.ఆర్టీసీ ఎలక్ట్రిక్ ఆటోలు కొనుగోలు చేసి నడుపుతుందని జరుగుతున్న ప్రచారంలో ఎలాంటి వాస్తవం లేదు. ఆటో కార్మికుల ఉపాధిని దెబ్బతీసేలా ఆర్టీసీకి ఎలాంటి ఆలోచన లేదు. ఆర్టీసీ ఎలక్ట్రిక్ ఆటోలు కొనుగోలు చేయదు. లాస్ట్ మైల్ కనెక్టివిటీని బలోపేతం చేయడమే మా లక్ష్యం. ఆర్టీసీ, రైల్వే, మెట్రో వంటి ప్రజా రవాణా వ్యవస్థలను సమన్వయం చేసి ప్రయాణికులకు ఇంటి నుంచి గమ్యస్థానం వరకు సౌకర్యవంతమైన రవాణా వ్యవస్థను అందించేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నాం. ప్రస్తుతం వినియోగంలో ఉన్న పెట్రోల్, డీజిల్ ఆటోలను రెట్రోఫిట్మెంట్ ద్వారా ఎలక్ట్రిక్ వాహనాలుగా మార్చేందుకు ఒక్కో ఆటోకు రూ.1.50 లక్షల వరకు ఆర్థిక సహాయం అందించాలని కేబినెట్ నిర్ణయించింది. ఆటో కార్మికులకు మరింత మేలు చేసేలా త్వరలోనే శుభవార్త చెబుతాం. వారి సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తుంది. ఆటో కార్మికుల ఉపాధికి పూర్తి రక్షణగా మా ప్రభుత్వం ఉంటుందని భరోసా ఇచ్చారు.

ఆ ఉగ్ర నెట్‌వర్క్‌ను భూస్థాపితం చేశాం: అమిత్ షా



ఐఎస్ఐ మద్దతు కలిగిన షహజాద్ భట్టీ నెట్‌వర్క్ అనే ఉగ్రవాద గ్రూప్‌ను నాశనం చేసినట్లు కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా ప్రకటించారు. స్వాతంత్ర్య దినోత్సవానికి ముందే.. ఆ గ్రూప్‌నకు చెందిన 200 మందికిపైగా సభ్యుల్ని అరెస్టు చేసినట్లు 'ఎక్స్' వేదికగా వెల్లడించారు. తద్వారా దాని విధ్వంసకర దాడుల ప్రణాళికలను భగ్నం చేసినట్లు తెలిపారు. ఉగ్రవాదం విషయంలో భారత్ కఠిన వైఖరికి ఇదొక ఉదాహరణ అని పేర్కొన్నారు.

"షహజాద్ భట్టీ నెట్‌వర్క్‌కు అనేక ఉగ్ర కార్యకలాపాల్లో ప్రమేయం ఉంది. ఈ క్రమంలోనే భారత భద్రతా దళాలు ఇటీవల 14 రాష్ట్రాల్లోని వివిధ ప్రాంతాల్లో సమన్వయంతో కూడిన ఆపరేషన్‌లు నిర్వహించాయి. 200 మందికిపైగా ఆపరేటివ్‌లను అరెస్టు చేసి.. భట్టీ నెట్‌వర్క్‌ను నాశనం చేశాయి. ఐఎస్ఐ నిధులతో నడిచే ఈ గ్రూప్ నుంచి ఐఈడీలు, పాకిస్థాన్ ఆయుధ ఫ్యాక్టరీ గుర్తులున్న గ్రెనేడ్లు, పిస్టళ్లు, తూటాలు, గూఢచర్యం కోసం ఉపయోగించిన సీసీటీవీ కెమెరాలు సహా పెద్దఎత్తున సామగ్రిని స్వాధీనం చేసుకున్నాయి" అని అమిత్ షా తెలిపారు.

తుపాకీతో ఇన్‌స్టాలో పోస్టు.. ఇంటికెళ్లి చూస్తే నోట్ల కట్టలు..!

ఇదిలా ఉండగా.. గత నెలలో మహారాష్ట్ర యాంటీ టెర్రరిజం స్క్వాడ్ (ఏటీఎస్) రాష్ట్రవ్యాప్తంగా ఓ భారీ ఆపరేషన్‌ను చేపట్టింది. ఇందులో భాగంగా పాకిస్థాన్‌కు చెందిన గ్యాంగ్‌స్టర్ షహజాద్ భట్టీతో సంబంధాలు ఉన్నాయనే ఆరోపణలపై 112 మందిని అధికారులు ప్రశ్నించారు. గ్యాంగ్‌స్టర్ భట్టీ సోషల్ మీడియా ప్లాట్‌ఫాంల ద్వారా దేశ వ్యతిరేక కార్యకలాపాల వైపు యువతను ఆకర్షించడానికి, వారిని ప్రభావితం చేయడానికి ప్రయత్నిస్తున్నట్లు ఏటీఎస్ అధికారి ఒకరు తెలిపారు.

ప్రభుత్వ వివరాల ప్రకారం.. షహజాద్ భట్టీ నెట్‌వర్క్ (ఎఫ్‌డీసీ) అనేది పాకిస్థాన్ కేంద్రంగా పనిచేస్తున్న ఒక ఉగ్రవాద గ్రూప్. భారత్‌లో పలు బాంబు దాడులు, హత్యల వెనుక దీని హస్తం ఉంది. పోలీస్, రక్షణ, మతపరమైన ప్రదేశాలను రెక్కీ చేసేందుకు, గూఢచర్యం కోసం సీసీటీవీ కెమెరాలను ఏర్పాటు చేసేందుకు స్థానిక మధ్యవర్తులకు డబ్బు చెల్లిస్తోంది. భట్టీపై ఎన్ఐఏ పలు కేసులను దర్యాప్తు చేస్తోంది. ఈ ఏడాది ఏప్రిల్‌లో అతడిని పరారీలో ఉన్న నిందితుడిగా పేర్కొంటూ ఓ కేసులో ఛార్జిషీట్ దాఖలు చేసింది.

తెలంగాణలో సార్ ముసాయిదా విడుదల..

హైదరాబాద్: తెలంగాణలో రాష్ట్ర ఎన్నికల సంఘం సార్ ముసాయిదా ఓటర్ల జాబితాను విడుదల చేసింది. రాఎఫీ ప్రక్రియలో మొదటి భాగం పూర్తయిందని రాష్ట్ర ఎన్నికల సంఘం అధికారులు వెల్లడించారు. రాష్ట్రవ్యాప్తంగా 78.30 శాతం ఎన్యూమరేషన్ పత్రాలు అందినట్లు తెలిపారు. ఇందులో 2.73 శాతం మంది చనిపోయినవారిగా గుర్తించినట్లు సుదర్శన్‌రెడ్డి వెల్లడించారు. మరోవైపు సుమారు 60 లక్షల మంది ఓటర్ల వివరాల్లో అనామలీస్ ఉన్నట్లు తెలిపారు.అలాగే 32 లక్షల మంది ఓటర్లు మ్యాపింగ్ చేసుకోలేదని అధికారులు గుర్తించారు. ఈ నేపథ్యంలో సుమారు 92 లక్షల మందికి నోటీసులు జారీ చేయనున్నట్లు సుదర్శన్‌రెడ్డి తెలిపారు. నోటీసులు అందుకున్న ఓటర్లు సంబంధిత పత్రాలను సమర్పించి తమ వివరాలను నిర్ధారించుకోవాలని సూచించారు.

'బీ', 'సీ' క్యాటగిరీలో రిజిస్ట్రేషన్ చేశారా..?

'ఏ'లో సీటు రాకపోయినా 'బీ'లో అవకాశం

నీట్ యూజీ సీట్ల కేటాయింపుపై నిపుణుల సూచన

హైదరాబాద్: నీట్ యూజీ 2026లో భాగంగా ఎంబీబీఎస్, బీడీఎస్ ప్రవేశాలకు రాష్ట్రంలో కాళోజీ ఆరోగ్య విశ్వవిద్యాలయం ఇచ్చిన ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ల ప్రక్రియ కొనసాగుతోంది. ఇప్పటికే 'ఏ' క్యాటగిరీ రిజిస్ట్రేషన్ల గడువు పూర్తయింది. ఈ నెల 20వ తేదీ వరకు 'బీ', 'సీ' క్యాటగిరీ కింద రిజిస్ట్రేషన్లు కొనసాగనున్నాయి. ఏ లో తప్పకుండా సీటు వస్తుందని భావించిన చాలామంది బీ, సీలో ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్లు చేసుకోవడం లేదు. అయితే తీరా ఏ లో సీటు రాక, ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోని కారణంగా బీ లో కూడా సీటు కోల్పోయే ప్రమాదం ఉంది. సాధారణంగా ఒక్కసారి గడువు పూర్తయితే బీ, సీ క్యాటగిరీలకు మళ్లీ రిజిస్ట్రేషన్లకు అవకాశం ఉండదు. గత ఏడాది పలువురు అభ్యర్థులు ఇలాగే నష్టపోయారు. వ్యయ ప్రయాసలకోర్చి న్యాయస్థానాన్ని ఆశ్రయించినా ఫలితం దక్కలేదు. ఈ నేపథ్యంలో రూ.12వేల రుసుముతో బీ, సీ క్యాటగిరీలో రిజిస్ట్రేషన్ చేసుకోవడం మేలని నిపుణులు సూచిస్తున్నారు.

అవగాహన లేకపోతే..

అభ్యర్థులు తమకు వచ్చిన ర్యాంకును బట్టి ఆల్ ఇండియా, అలాంటి వారు ముందుజాగ్రత్తగా ఏతో పాటు బీ క్యాటగిరీ కింద కూడా రిజిస్ట్రేషన్ చేసుకోవడం శ్రేయస్కరమని నిపుణులు చెబుతున్నారు. ఉదాహరణకు ఈసారి 438 మార్కులు సాధించిన ఎస్టీ క్యాటగిరీ అమ్మాయి ఆల్ ఇండియా కోటాలో మాత్రమే రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. అందులో కచ్చితంగా ర్యాంకు వస్తుందని భావించి స్థానిక కోటాలో ఏ క్యాటగిరీకి రిజిస్ట్రేషన్ చేసుకోలేదు. ఆమె ఒకవేళ రిజిస్ట్రేషన్ చేసుకుని ఉంటే రాష్ట్రంలో ప్రభుత్వ కళాశాలలోనే సీటు దక్కే అవకాశం ఉండేది. ఇలా చాలామంది అవగాహన లేక నష్టపోతున్నారు. ఏ క్యాటగిరీ కింద రిజిస్ట్రేషన్ చేసుకొని మళ్లీ బీ, సీ కింద నమోదు కావాలంటే రిజిస్ట్రేషన్ రుసుము అదనంగా చెల్లించాలి. రూ.12వేల రిజిస్ట్రేషన్ రుసుము భారం కాదని భావిస్తే.. ముందుజాగ్రత్తగా బీ, సీలో సైతం రిజిస్ట్రేషన్ చేసుకోవడం మేలని గత అనుభవాలు చెబుతున్నాయి. సాధారణంగా బీ క్యాటగిరీలో ప్రైవేటు కళాశాలల్లో మొత్తం కోర్సు రుసుము రూ.58 లక్షల వరకు నిర్ణయించారు. ఈ మొత్తం భరించే ఆర్థిక స్తోమత ఉన్నవాళ్లు ఏ క్యాటగిరీలో సీటు దక్కదనే సందేహం ఉంటే బీ లో కూడా రిజిస్ట్రేషన్ చేసుకోవడం వల్ల ప్రయోజనం ఉంటుంది. సాధారణంగా ఏ లో కన్వీనర్, బీ లో మేనేజ్‌మెంట్, సీ లో ఎన్నారై కోటాలో సీట్లు ఉంటాయి.



తెలంగాణ పవర్

సంపాదకీయం

మంగళవారం,ఆగస్టు 18, 2026

ఎన్డీయేకు ఊపిరి...

దేశ రాజధాని ఢిల్లీలో రాజకీయ సమీకరణాలు వేగంగా మారుతున్నాయి. కేంద్రంలో వరుసగా మూడోసారి అధికారంలోకి వచ్చిన నేషనల్ డెమొక్రటిక్ అలైన్స్ ప్రభుత్వం, పాలనను మరింత సమర్థవంతంగా, మిత్రపక్షాల మధ్య ఎటువంటి మనస్పర్థలు లేకుండా నడిపించాలని నిర్ణయించుకున్నారు. ఇందులో భాగంగా గతంలో ఎన్డీఏ ఉన్న కన్వీనర్ వ్యవస్థను పునరుద్ధరించాలని బీజేపీ భావిస్తోంది. ఈ ప్రతిపాదనకు ప్రధాని నరేంద్ర మోదీ సానుకూలంగా స్పందించి, గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్టు సమాచారం. 2024లోక్‌సభ ఎన్నికల ఫలితాల తర్వాత కేంద్రంలో భారతీయ జనతా పార్టీ సొంతంగా మేజిక్ ఫిగర్‌ను దాటలేకపోయింది. ప్రస్తుతం ఎన్డీయే ప్రభుత్వం 293 మంది ఎంపీల మద్దతుతో నడుస్తోంది. ఇందులో తెలుగుదేశం పార్టీ 16 సీట్లు, జనతాదళ్ యునైటెడ్12 సీట్లు అత్యంత కీలక పాత్ర పోషిస్తున్నాయి. పదేళ్లలో బీజేపీకి సొంతంగా మెజారిటీ ఉండటంతో నిర్ణయాలన్నీ ఏకపక్షంగా సాగాయి. కానీ ఇప్పుడు సమ్మతి రాజకీయాల కాలం నడుస్తోంది. మిత్ర పక్షాల డిమాండ్లు, రాష్ట్రాల ప్రయోజనాలు, కేంద్ర ప్రభుత్వ విధానాల మధ్య సరైన కమ్యూనికేషన్ ఉండేలా చూడటమే ఈ కన్వీనర్ నియామకం వెనుక ఉన్న ఉద్దేశం. అత్యున్నత బాధ్యతాయుతమైన పదవికి ఇద్దరు సీనియర్ నాయకుల పేర్లు గట్టిగా వినిపిస్తున్నాయి. ఇందులో మొదటి పేరు చంద్రబాబు నాయుడు. దశాబ్దాల రాజకీయ అనుభవం ఉన్న చంద్రబాబుకు జాతీయ స్థాయిలో బలమైన నెట్‌వర్క్ ఉంది. గతంలో నేషనల్ ఫ్రంట్, యునైటెడ్ ఫ్రంట్ వంటి కూటములను నడిపించిన చారిత్రక అనుభవం ఆయన సొంతం. దక్షిణాది, ఉత్తరాది పార్టీలతో ఆయనకు ఉన్న సత్సంబంధాలు కూటమికి అదనపు బలం ఇస్తాయని బీజేపీ భావిస్తోంది. రెండో పేరు నితీష్ కుమార్. హిందీ హార్ట్‌లాండ్‌గా పిలిచే ఉత్తర భారత్ రాజకీయాల్లో నితీష్ కుమార్ మాస్టర్ మైండ్. బిహార్ ముఖ్యమంత్రిగా సుదీర్ఘ అనుభవం, ఇతర ప్రాంతీయ పార్టీలతో సమన్వయం చేయగల నైపుణ్యం ఆయనకు ఉన్నాయి. ప్రధాని మోదీతో ఆయనకు ఉన్న ప్రత్యేక అనుబంధం కూడా ఇక్కడ కలిసి వచ్చే అంశం. ఢిల్లీలో త్వరలోనే ఎన్డీఏ భాగస్వామ్య పక్షాల మెగా సమావేశం జరగనుంది. ప్రధాని మోదీ ఇప్పటికే ఈ ప్రతిపాదనకు ఆమోదం తెలిపినందున, ఈ సమావేశంలోనే అధికారికంగా కన్వీనర్ పేరును ప్రకటించే అవకాశం ఉందని పొలిటికల్ నర్కిల్స్ చెబుతున్నాయి.ఎన్డీయే కన్వీనర్‌గా ఎన్నికయ్యే వ్యక్తి కేవలం ఒక ప్రతినిధి మాత్రమేకాదు. కూటమిలోని అన్ని పార్టీలను ఏకతాటిపైకి తెచ్చే వారధిగా వ్యవహరిస్తారు. మిత్రపక్షాల మధ్య వచ్చే చిన్నపాటి విభేదాలను చర్చల ద్వారా ప్రాథమిక దశలోనే పరిష్కరించాలి. ఉభయ సభల్లో బిల్లులు పాస్ చేసే సమయంలో భాగస్వామ్య పక్షాలన్నీ ఒకే మాటపై ఉండేలా చూడాలి. వివిధ రాష్ట్రాల్లో జరిగే అసెంబ్లీ ఎన్నికల్లో సీట్ల సర్దుబాటును సజావుగా పూర్తి చేయడం వీరి విధి. ఈ ప్రతిష్టాత్మక నేషనల్ డెమొక్రటిక్ ఫ్రంట్ కన్వీనర్ పదవికి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి, తెలుగుదేశం పార్టీ అధినేత నారా చంద్రబాబు నాయుడుతో పాటు, జేడీయూ అధినేత, బీహార్ మాజీ ముఖ్యమంత్రి నితీష్ కుమార్ పేర్లు జాతీయ స్థాయిలో బలంగా వినిపిస్తున్నాయి. గతంలో కేంద్రంలో కూటమి ప్రభుత్వాలను నడిపించిన అపార అనుభవం, ప్రాంతీయ పార్టీలను ఏకతాటిపైకి తెచ్చిన ట్రాక్ రికార్డ్ ఉన్న చంద్రబాబు వైపు మెజారిటీ పార్టీలు మొగ్గు చూపే అవకాశం ఉందని తెలుస్తోందిఅయితే కూటమిలోని అందరు భాగస్వామ్య నేతలతో చర్చించి, అందరికీ ఆమోదయోగ్యుడైన మరో సీనియర్ నేత పేరును కూడా పరిశీలించే అవకాశం లేకపోలేదు. కేంద్రంలో మూడోసారి ఎన్డీయే ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత వివిధ రాష్ట్రాల సమస్యలు, సంక్షేమ పథకాల అమలు, కూటమి పార్టీల మధ్య ఎప్పటికప్పుడు చర్చలు జరపడానికి ఒక ప్రత్యేక యంత్రాంగం అవసరమని ఈ నిర్ణయం తీసుకున్నట్లు రాజకీయ వర్గాలు విశ్లేషిస్తున్నాయి. త్వరలోనే జరగబోయే ఎన్డీయే అగ్రనేతల ప్రత్యేక భేటీలో ఈ కన్వీనర్ నియామకంపై అధికారికంగా ఒక స్పష్టత వచ్చే అవకాశం ఉంది. దేశ రాజకీయాల్లో అత్యంత ప్రాధాన్యత సంతరించుకున్న ఈ పరిణామం చర్చనీయాంశంగా మారింది.ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్, బిహార్ వంటి రాష్ట్రాలు కేంద్రం నుంచి రావాల్సిన నిధులు, ప్రాజెక్టుల విషయంలో ఈ పదవి చాలా కీలకం కానుంది. రాష్ట్రాల్లోని సమస్యలై నేరుగా కేంద్రమంత్రులు, హోంమంత్రితో చర్చించి నిర్ణయాలు తీసుకునే వెసులుబాటు ఉంటుంది.

-ఎడిటర్

ఉజ్జైన్ మహాకాలేశ్వరాలయానికి భారీగా పోటెత్తిన భక్తులు.. తొక్కిసలాటలో పలువురికి గాయాలు



న్యూఢిల్లీ, మధ్యప్రదేశ్‌లోని ఉజ్జైన్‌లో ఉన్న దేవాలయంలో తొక్కిసలాట జరిగింది. ఈ ఘటనలో పలువురికి గాయాలయ్యాయి. దైవ దర్శనానికి భక్తులు పోటెత్తడంతో ఈ ఘటన జరిగింది. పోలీసులు స్పందించి పరిస్థితిని అదుపులోకి తీసుకొచ్చారు. మధ్యప్రదేశ్, ఉజ్జైన్‌లో ప్రసిద్ధ మహకాళేశ్వర ఆలయ ప్రాంగణంలోనే శ్రీ హరసిద్ధి మాతా శక్తిపీఠ్ టెంపుల్, శ్రీ బడా గణేష్ మందిర్ పరిధిలో సోమవారం ఉదయం ఈ ఘటన జరిగింది. ఇక్కడే నాగచంద్రేశ్వర ఆలయం కూడా ఉంది. శ్రావణ సోమవారం కావడంతో నాగచంద్రేశ్వర ఆలయానికి భక్తులు పోటెత్తారు. అయితే, అక్కడ ఏదో విద్యుత్ షాక్ తగిలింది అనే ప్రచారం జరగడంతో ఒకరినొకరు తోసుకున్నారు. దీంతో ఒక్కసారిగా తొక్కిసలాట జరిగింది. ఈ క్రమంలో కొందరు భక్తులు కిందపడిపోగా, మరికొందరు వారిని తొక్కుకుంటూ వెళ్లారు. అలా, పలువురు భక్తులకు గాయాలైనట్లు తెలుస్తోంది. కింద పడిన వారిని ఇతరులు తొక్కుకుంటూ వెళ్లారే తప్ప సాయం కూడా చేయలేదని కొందరు సాక్షులు తెలిపారు. ఈ ఘటనపై సమాచారం అందుకున్న పోలీసులు, ఇతర అధికారులు అక్కడికి చేరుకున్నారు. పరిస్థితిని అదుపులోకి తెచ్చారు. భక్తుల్ని అదుపులోకి తెచ్చేందుకు పోలీసులు, సిబ్బంది చాలా శ్రమించాల్సి వచ్చింది.గాయాలపాలైన వారిని అధికారులు స్థానిక ఆస్పత్రికి తరలించి, చికిత్స అందిస్తున్నారు. ప్రస్తుతం ఎలాంటి ఉద్రిక్త పరిస్థితి లేదని పోలీసులు తెలిపారు. అయితే, ఉదయం జరిగిన తొక్కిసలాట ఘటనపై ఆరా తీస్తున్నారు. బాధితుల్లో పలువురు స్త్రీలు కూడా ఉన్నారు. ఒక వ్యక్తి కాలికి తీవ్ర గాయాలైనట్లు తెలుస్తోంది. అంతకుముందు బిహార్‌లోని ఒక ఆలయంలో జరిగిన తొక్కిసలాట ఘటనలో ఏడుగురు మరణించిన సంగతి తెలిసిందే.

అస్సాం ప్రభుత్వం సంచలన నిర్ణయం.. రెండో పెళ్లి చేసుకుంటే 20% జీతం కట్..

అస్సాం ముఖ్యమంత్రి హిమంత బిశ్వ శర్మ ప్రభుత్వ ఉద్యోగులకు వార్నింగ్ ఇచ్చారు. మొదటి భార్యకు చట్టపరంగా విడాకులు ఇవ్వకుండా రెండో పెళ్లి చేసుకుంటే చర్యలు తప్పవన్నారు. రెండో పెళ్లి చేసుకున్న ప్రభుత్వ ఉద్యోగి జీతం నుంచి 20 శాతం డబ్బులు కట్ చేసి మొదటి భార్య బ్యాంక్ అకౌంట్‌లో జమ చేస్తామన్నారు. ఉద్యోగి మొదటి భార్య ప్రభుత్వానికి వినతి పత్రం సమర్పిస్తే చర్యలు తీసుకుంటామన్నారు.ఆగస్టు 15వ తేదీన గువహటి ఖానాపారా మైదానంలో జరిగిన 78వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో ముఖ్యమంత్రి హిమంత బిశ్వ శర్మ పాల్గొన్నారు. ముఖ్యమంత్రి తన అధికారిక ప్రసంగంలో ఈ సంచలన నిర్ణయాన్ని ప్రకటించారు. ముఖ్యమంత్రి హిమంత మాట్లాడుతూ.. ఈ మధ్య కాలంలో ప్రభుత్వ ఉద్యోగులు మొదటి భార్యకు విడాకులు ఇవ్వకుండా అనధికారికంగా రెండో పెళ్లి చేసుకుంటున్న లేదా వేరే మహిళతో సహజీవనం చేస్తున్న సంఘటనలు బాగా పెరిగిపోయాయని వెల్లడించారు.విడాకుల కేసు కోర్టులో



నడుస్తున్నప్పటికీ తప్పు చేసిన ఉద్యోగి జీతం నుంచి 20 శాతం డబ్బులు కట్ అయి మొదటి భార్య అకౌంట్‌లో పడతాయని తెలిపారు. లీగల్ ప్రొసీడింగ్స్ ముగిసే వరకు మొదటి భార్యకు ఆర్థికంగా మద్దతు ఇచ్చేందుకే ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుందని పేర్కొన్నారు. చట్టాలను ఉల్లంఘించినా.. సర్వీస్ రూల్స్‌ను అతిక్రమించినా ఉద్యోగిపై చర్యలు తీసుకుంటామని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు.

కిడ్నాప్ డ్రామా ఆడిన యువకుడు.. ఆ చిన్న తప్పుతో అడ్డంగా దొరికిపోయాడు..



నిరుద్యోగం, ఆర్థిక కష్టాల నేపథ్యంలో ఓ యువకుడు తప్పుదారి పట్టాడు. కిడ్నాప్ డ్రామా ఆడి తల్లిదండ్రులను మోసం చేయాలని చూశాడు. వారినుంచి పెద్ద మొత్తంలో డబ్బులు కాజేయాలని అనుకున్నాడు. అయితే, సెల్ ఫోన్ సిగ్నల్స్ కారణంగా కిడ్నాప్ డ్రామా ఫెయిల్ అయింది. అతడు అడ్డంగా పోలీసులకు దొరికిపోయాడు. ఈ సంఘటన మహారాష్ట్రలో ఆదివారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. ఉత్తర్‌ప్రదేశ్‌లోని బంద జిల్లాకు చెందిన ఓం ప్రకాశ్ గౌరీ శంకర్ అనే 19 ఏళ్ల యువకుడు ఉద్యోగం కోసం పుణె వచ్చాడు.నెలలు గడుస్తున్నా ఉద్యోగం దొరక్కపోవటంతో ఆర్థిక ఇబ్బందుల్లో చిక్కుకున్నాడు. ఆర్థిక కష్టాలనుంచి ఎలా బయటపడాలో ఆలోచిస్తున్న సమయంలో మోసపూరితమైన ఆలోచన వచ్చింది. కిడ్నాప్ డ్రామా మొదలెట్టాడు. తనను గుర్తు తెలియని వ్యక్తులు కిడ్నాప్ చేశారని, 5 లక్షల రూపాయలు ఇస్తేనే విడుదల చేస్తామని అంటున్నారని కుటుంబసభ్యులకు ఫోన్ చేసి చెప్పాడు. కుటుంబసభ్యులను నమ్మించటం కోసం ఏడుస్తూ ఓ వీడియో చిత్రీకరించి పంపాడు. భయపడిపోయిన కుటుంబసభ్యులు వెంటనే ఉత్తర్‌ప్రదేశ్ పోలీసులను ఆశ్రయించారు. కిడ్నాప్ కేసు పెట్టారు.ఉత్తర్‌ప్రదేశ్ పోలీసులు పుణె పోలీసులకు సమాచారం అందించారు. దీంతో ఆగస్టు 16వ తేదీన పుణె పోలీసులు సెర్చ్ ఆపరేషన్ మొదలెట్టారు. పలు పోలీస్ స్టేషన్‌లకు చెందిన బృందాలు, నైట్ పెట్రోలింగ్ యూనిట్స్ రంగంలోకి దిగాయి. పోలీసులు ఓం ప్రకాశ్ సెల్‌ఫోన్ సిగ్నల్స్ ఆధారంగా అతడు ఎక్కడున్నాడో వెతకటం మొదలెట్టారు. ఓ హోటల్ దగ్గర సెల్ ఫోన్ సిగ్నల్స్ చూపిస్తుండటంతో అక్కడికి వెళ్లారు. హోటల్ పరిసరాల్లో తిరుగుతున్న ఓం ప్రకాశ్ పోలీసులకు కనిపించాడు. పోలీసులు ఓం ప్రకాశ్‌ను అదుపులోకి తీసుకుని విచారించగా అసలు విషయం బయటపెట్టాడు. డబ్బు కోసమే కిడ్నాప్ డ్రామా ఆడినట్లు చెప్పాడు.

బడులలో అసంపూర్తి పనులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయించాలి

నాణ్యతా ప్రమాణాలు పాటించని కాంట్రాక్టర్ లను బ్లాక్ లిస్టులో పెడతాం

వారం రోజుల్లోపు ఏకరూప దుస్తులు పంపిణీ చేయాలి

కలెక్టర్ తో కలిసి అధికారులతో సమీక్ష నిర్వహించిన ప్రభుత్వ సలహాదారు సుదర్శన్ రెడ్డి

నిజామాబాద్, ఆగస్టు 17 : ప్రభుత్వ విద్యా సంస్థలలో మౌలిక సదుపాయాలను మరింతగా మెరుగుపర్చేందుకు వీలుగా చేపట్టిన పనులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయించాలని ప్రభుత్వ సలహాదారు పి.సుదర్శన్ రెడ్డి సూచించారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని స్టేట్ చాంబర్ లో సోమవారం ఆయన కలెక్టర్ భవేష్ మిశ్రాతో కలిసి వివిధ శాఖల పనితీరుపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. వివిధ పాఠశాలల్లో పెండింగ్ లో ఉన్న అసంపూర్తి పనులను గుర్తించి, విద్యార్థులు సంఖ్య, స్థానిక అవసరాలకు అనుగుణంగా ప్రాధాన్యతా క్రమంలో చేపట్టి పూర్తి చేయాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఎక్కడ కూడా తాగునీరు, టాయిలెట్స్ వంటి సమస్యలు లేకుండా చూడాలన్నారు. విద్యార్థులు ప్రయోజనాల విషయంలో ఎంతమాత్రం రాజీ పడకూడదని, నూటికి నూరు శాతం పనులు నాణ్యతతో జరిగేలా పకడ్బందీ పర్యవేక్షణ చేయాలన్నారు. నాణ్యతా ప్రమాణాలు పాటించని కాంట్రాక్టర్ లను బ్లాక్ లిస్టులో పెట్టాలని అధికారులకు సూచించారు. పెండింగ్ పనులను పూర్తి చేసేందుకు అవసరమైన నిధుల విషయమై ఉన్నతాధికారులను సంప్రదించి మంజూరు చేయిస్తానని తెలిపారు. అయితే పనులను పూర్తి చేయించే విషయంలో నిర్లక్ష్యం వహించకుండా, విద్యార్థులకు అన్ని సదుపాయాలు అందుబాటులో ఉండేలా చూడాలని హితవు పలికారు. మరుగుదొడ్లు, మూత్రశాలల నిర్మాణాలు, మరమ్మతుల కోసం వీబీజీరాంజీ పథకం కింద ప్రతిపాదనలు పంపాలని, నిధులను పూర్తి స్థాయిలో సద్వినియోగం చేసుకునేలా చొరవ చూపాలన్నారు. జిల్లాలోని అన్ని పాఠశాలల విద్యార్థిని, విద్యార్థులకు వారం రోజుల్లోపు ఏకరూప దుస్తులు (యూనిఫాంలు) పంపిణీ జరిగేలా చర్యలు తీసుకోవాలని, స్వయం సహాయక సంఘాల ద్వారా యూనిఫాంలను వేగవంతంగా కుట్టించాలని ప్రభుత్వ సలహాదారు సుదర్శన్ రెడ్డి సూచించారు. ఉపాధ్యాయుల కొరత నెలకొని ఉన్న బడులలో ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా బోధకులను ఏర్పాటు చేసి, విద్యార్థులకు నాణ్యమైన విద్యను బోధించేలా కృషి చేయాలన్నారు. పౌర సరఫరాల శాఖ పనితీరును సమీక్షిస్తూ, డిఫాల్ట్ రైస్ మిల్లర్లపై చేపట్టిన చర్యల గురించి అడిగి తెలుసుకున్నారు.

నాలుగు నెలల్లో 22 మందికి మరణశిక్ష.. వార్తల్లో సెషన్స్ న్యాయమూర్తి..!

ఉత్తర్‌ప్రదేశ్ లోని ముజఫర్‌నగర్ కోర్టు సంచలన తీర్పులతో వార్తల్లో నిలిచింది. అదనపు జిల్లా, సెషన్స్ కోర్టు న్యాయమూర్తి రవి కుమార్ దివాకర్ గత నాలుగు నెలల్లో విచారించిన 10 కేసుల్లో.. ఏకంగా 22 మందికి మరణశిక్ష విధించారు. న్యాయవాది హత్య నుంచి కిడ్నాప్, దోపిడీ వంటి పలు కేసుల్లో



దోషులుగా తేలిన వారికి ఈ శిక్షలు వడ్డాయి.గతంలో బరేలీలో పనిచేసిన సమయంలోనూ న్యాయమూర్తి రవి కుమార్ దివాకర్.. 13 మందికి మరణశిక్ష విధించారు. దాంతో ఇప్పటివరకు ఆయన విధించిన మరణశిక్షల సంఖ్య 35కు చేరింది. 2022లో వారణాసిలోని జ్ఞాన్‌వాపీ మసీదు సముదాయంలో వీడియో సర్వేకు ఆదేశించి ఆయన జాతీయ స్థాయిలో వార్తల్లో నిలిచారు. ఇటీవల కాలంలో వరుసగా మరణశిక్షలు విధించడంతో 'అత్యంత అరుదైన కేసుల్లోనే' ఈ శిక్ష విధించాలన్న న్యాయసూత్రంపై చర్చ మొదలైంది.అయితే సెషన్స్ కోర్టు విధించిన మరణశిక్ష తుదితీర్పు కాదు. హైకోర్టు ధ్రువీకరించిన తర్వాతే దాన్ని అమలు చేయాల్సి ఉంటుంది. ఒకవేళ హైకోర్టు సెషన్స్ కోర్టు విధించిన శిక్షను ధృడపర్చినా పైకోర్టులో అప్పీల్ చేసుకునే అవకాశం ఉంటుంది.

'ప్రజలకు ప్రభుత్వానికి మధ్య వారధులుగా అధికారులు పని చేయాలి'

ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు



చుంచుపల్లి, ఆగస్టు 17 : ప్రజల సమస్యలను తెలుసుకుని సత్వర పరిష్కారానికి అధికారులు కృషి చేయాలని, ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా వారి అవసరాలను గుర్తించి సేవలు అందించాలని ఎమ్మెల్యే కోననేని సాంబశివరావు అధికారులకు సూచించారు. సోమవారం చుంచుపల్లి మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి ఎమ్మెల్యే హాజరై ఎంపీడీవో సుభాషిణితో కలిసి ప్రజల నుండి ఫిర్యాదులను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజావాణి కార్యక్రమానికి అందరూ అధికారులు తప్పకుండా హాజరు కావాలన్నారు. ప్రజలకు ప్రభుత్వానికి మధ్య వారధిగా అధికారులు పని చేయాలని, అందిన వినతులను సంబంధిత శాఖలకు వెంటనే పంపించి సమస్యలను త్వరితగతిన పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. మండల పరిధిలోని వివిధ గ్రామాల నుంచి మొత్తం 22 ఫిర్యాదులు అందినట్లు ఎంపీడీవో తెలిపారు. గృహజ్యోతి, ఆసరా పింఛన్లు, ఒంటరి మహిళల పింఛన్లు, ఇందిరమ్మ ఇళ్లు, డ్రైనేజీ కాలువలు తదితర సమస్యలకు సంబంధించిన వినతులు అందినట్లు ఆమె పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో తాసీల్దార్ నాగరాజు, ఎంపీఓ సంధ్య పాల్గొన్నారు.

కల్యాణ లక్ష్మి పథకాన్ని కొనసాగించాలని బీఆర్ఎస్ ధర్నా. వరంగల్ కలెక్టరేట్ ఎదుట ఉద్రిక్తత

హనుమకొండ,ఆగస్టు 17: వరంగల్ జిల్లా కలెక్టరేట్ వద్ద ఉద్రిక్తత పరిస్థితి నెలకొన్నాయి. బీఆర్ఎస్ పార్టీ కార్యాలయం నుండి బీఆర్ఎస్ పార్టీకి చెందిన మహిళలు వరంగల్ జిల్లా కలెక్టరేట్ వరకు ర్యాలీగా వచ్చారు. వరంగల్ జిల్లా కలెక్టరేట్ ఎదుట రోడ్డుపై బైఠాయించి బీఆర్ఎస్ శ్రేణులు ఆందోళన చేపట్టారు. సీఎం రేవంత్ రెడ్డి దిష్టి బొమ్మను దగ్ధం చేశారు. ఈ నిరసనకు మాజీ ఎమ్మెల్యేలు వినయ్ భాస్కర్, చల్లా ధర్మా రెడ్డి మద్దతు తెలిపారు. వినయ్ భాస్కర్ ను అరెస్ట్ చేసి పోలీస్ స్టేషన్‌కు తరలిస్తుండగా బీఆర్ఎస్ నాయకులు అడ్డుకున్నారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ నాయకులు మాట్లాడుతూ..కళ్యాణ లక్ష్మి ,షాదీ ముబారక్ పథకాలను కాంగ్రెస్ ప్రభుత్వం ఎత్తివేసేందుకు ప్రయత్నిస్తున్నదని ఆరోపించారు.గత ప్రభుత్వం పేద కుటుంబాల ఆడబిడ్డల వివాహాలకు అండగా నిలిచేందుకు కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాలను సమర్థవంతంగా అమలు చేసిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అనంతరం పథకాల అమలులో నిర్లక్ష్యం చేస్తూ అర్హులైన లబ్ధిదారులను ఇబ్బందులకు గురిచేస్తోందని ఆరోపించారు.పేదల ఇండ్లలో వెలుగులు నింపుతున్న కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాలను కొనసాగించాలని డిమాండ్ చేశారు. లేదంటే బీఆర్ఎస్ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన చేపడుతామని హెచ్చరించారు.



యూపీలో షాకింగ్ రిజల్ట్..

లక్నో, ఆగస్టు 17, (న్యూస్ పల్స్)ఉత్తర్ ప్రదేశ్ లో వచ్చే ఏడాది జరిగే అసెంబ్లీ ఎన్నికలు కేంద్రంలో బీజేపీకి చావో రేవో అన్నట్లు మారాయి. కాక్రోచ్ ఉద్యమం తర్వాత దేశంలో మారిన పరిస్థితుల్లో ఓటర్లు తమవైపే ఉన్నారని చెప్పుకునేందుకు ఈ ఎన్నికలు కీలకంగా మారాయి. ఇందులో గెలిస్తేనే 2029లో జరిగే సార్వత్రిక ఎన్నికల్లో బీజేపీ గెలిచే అవకాశాలు ఉంటాయి. అలా జరగకపోతే మాత్రం బీజేపీ పతనం ప్రారంభమైనట్లే భావించవచ్చు. ఇలాంటి పరిస్థితుల్లో యూపీ ఓటరు నాడిపై పోల్ ట్రాకర్ నిర్వహించిన ఒపీనియన్ పోల్ లో సంచలన ఫలితాలు వెలువడ్డాయి. యూపీలో ప్రాంతాల వారీగా పోల్ ట్రాకర్ నిర్వహించిన ఒపీనియన్ పోల్ ఫలితాలను ఇవాళ సాయంత్రం దశల వారీగా ఎక్స్ లో ట్వీట్లు చేస్తోంది. ఇందులో ముందుగా పూర్వాంచల్ ప్రాంతంలోని 133 సీట్లలో నిర్వహించిన సర్వేలో ఇండియా కూటమికి 73 సీట్లు, ఎన్డీయేకుకు 56 సీట్లు దక్కుతాయని తేలింది. బీఎస్పీకి 3 సీట్లు, ఇతరులకు ఒక సీటు దక్కనున్నాయి. అలాగే అవధ్ ప్రాంతంలోని 82 సీట్లలో నిర్వహించిన సర్వేలో ఇండియా కూటమికి 45 సీట్లు, ఎన్డీయే కూటమికి 35 సీట్లు దక్కుతున్నట్లు తేలింది. బీఎస్పీ 2 సీట్లు సాధించే అవకాశం ఉంది. ఈ రెండు ప్రాంతాల్లోనూ ఇండియా కూటమికి 44-49 శాతం ఓట్లు, ఎన్డీయేకు 39-45 శాతం ఓట్లు లభిస్తున్నాయి పశ్చిమ యూపీ ప్రాంతంలోని 79 సీట్లలో నిర్వహించిన ఒపీనియన్ పోల్ లో ఇండియా కూటమికి 48 సీట్లు, ఎన్డీయేకు 34 సీట్లు, బీఎస్పీకి రెండు సీట్లు రాబోతున్నట్లు తేలింది. ఇక్కడ కూడా రెండు కూటముల ఓట్ల శాతాల్లో మిగతాప్రాంతాలతో పోలిస్తే ఎలాంటి మార్పూ లేదు. బ్రజ్ ప్రాంతంలో ఉన్న 56 సీట్లలో ఇండియా కూటమికి 31 సీట్లు, ఎన్డీయే కూటమికి 24 సీట్లు రాబోతున్నట్లు తేలింది. బీఎస్పీకి ఇక్కడ ఒక సీటు రానుంది. అలాగే బుందేల్ ఖండ్ ప్రాంతంలో ఉన్న 53 సీట్లలో ఇండియా కూటమికి 28 సీట్లు, ఎన్డీయే కూటమికి 22 సీట్లు, బీఎస్పీకి ఒక సీటు వస్తుందని సర్వే తేల్చింది. ఈ లెక్కన ఇండియా కూటమికి 225 సీట్లు రాబోతున్నట్లు అంచనా వేసింది. ఎన్డీయే కూటమికి కేవలం 171 సీట్లు రాబోతున్నట్లు సర్వే తేల్చింది. బీఎస్పీకి 9 సీట్లు వస్తున్నట్లు తేలింది. యూపీ అసెంబ్లీలో 403 సీట్లలో అధికారానికి కావాల్సిన మ్యాజిక్ మార్క్ 202 సీట్లు. కాబట్టి ఇండియా కూటమి గెలుస్తుందని సర్వే అంచనా వేసింది.

మురుతున్న వందే మాతరం వివాదం

లక్నో, ఆగస్టు 17, (న్యూస్ పల్స్)జాతీయ గేయం వందేమాతరం ఆలాపన విషయంలో కాంగ్రెస్ వివాదంలో ఇరుక్కుంది. కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యాలయంలో స్వాతంత్ర దినోత్సవ వేడుకలపై దుమారం రేగింది. జాతీయ వతాక ఆవిష్కరణ నందర్భంగా వందేమాతరం పూర్తి గేయాన్ని ఆలాపించకుండా, ఆ పార్టీ అగ్రనేత సోనియా గాంధీ మధ్యలోనే అడ్డుకున్నారని, ఆపేయమన్నారని విమర్శలు వచ్చాయి. సోనియా గాంధీ, రాహుల్ గాంధీకి, ఆ పార్టీ నేతలకు, జాతీయ అధ్యక్షుడికి పూర్తి వందేమాతరం ఆలాపించడానికి ఇష్టపడుతున్నట్లు లేదని బీజేపీ విరుచుకుపడుతోంది. కొందరి ఆలోచనా ధోరణి 1947 కి పూర్వం ఎలా వుందో ఆ తర్వాత అలాగే వుందని కూడా విరుచుకుపడుతున్నారు.అలాగే రాజకీయాలకు అతీతులైన వ్యక్తులు కూడా ఈ పరిణామంపై స్పందిస్తున్నారు.బంకిం చంద్ర చటోపాధ్యాయ వారసుడైన సుమిత్రో చటర్జీ కూడా స్పందించారు. జాతీయ గీతం ప్రసారమవుతుండగా గాంధీ, కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే తమలో తాము మాట్లాడుకోవడం తన కుటుంబాన్ని "బాధించిందని" ఆయన పేర్కొన్నారు.అయితే ఈ విమర్శలను కాంగ్రెస్ ఖండిస్తోంది."వందేమాతరం గేయాన్ని ఆలపిస్తున్న సమయంలో ఖర్గే నిలబడి ఉన్నారు.. ఆయనకు కుర్చీ వేయాలని మాత్రమే సోనియా సైగ చేశారు. అంతేకానీ.. పూర్తిగేయాన్ని ఆపేయాలని ఆమె కోరలేదు." అని కాంగ్రెస్ వివరించింది. ఈ వివాదంపై స్పందించిన సీనియర్ నేత జైరాం రమేశ్.. "1937, అక్టోబరు 28న కోల్‌కతాలో జరిగిన కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ సమావేశంలో వందేమాతరం గేయంలోని ప్రారంభ చరణాలను మాత్రమే ఆలపించాలని మహాత్మా గాంధీ, సర్దార్ పటేల్, రవీంద్రనాథ్‌ఠాగూర్ వంటి పెద్దలు నిర్ణయించారు." అని గుర్తు చేశారు. అప్పటి నుంచి కాంగ్రెస్ పార్టీ ప్రతికార్యక్రమంలోనూ వందేమాతరం ఆలపిస్తోందని, దీనిపై వివాదం లేదని, వారు సృష్టించారని స్పష్టం చేశారు. కార్యక్రమంలో వందేమాతరం పూర్తి గేయాన్ని ఆలపించామని తెలిపారు.

ఆటో డ్రైవర్ ఇంట్లో బయటపడిన రూ.3 కోట్లు.. సంచుల నిండా డబ్బులే..

మధ్యప్రదేశ్: ఓ ఆటో డ్రైవర్ ఇంట్లో రూ.3 కోట్లు లభ్యమైన ఘటన మధ్యప్రదేశ్‌లోని సాగర్‌లో చోటుచేసుకుంది. ఆటో డ్రైవర్ ఇంట్లో మారణాయుధాలు ఉన్నాయని సమాచారం రావడంతో పోలీసులు సోదా చేసేందుకు వెళ్లారు. ఈ సందర్భంగా పెద్దఎత్తున నగదు సంచులు కనిపించడంతో ఆశ్చర్యానికి గురయ్యారు. దాదాపు ఐదు గంటల పాటు శ్రమించి నగదును లెక్కించారు. అనంతరం దానిని స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.సాగర్‌లోని గోపాల్‌గంజ్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఆటో డ్రైవర్ రాజేశ్ అహిర్వార్ తన కుటుంబంతో కలిసి నివాసం ఉంటున్నాడు. అతని కుమారుడు సౌరభ్ అహిర్వార్ ఇటీవల సోషల్ మీడియాలో ఓ ఫొటోను షేర్ చేశాడు. తుపాకీతో దిగిన ఆ ఫొటో స్థానికులను భయాందోళనలకు గురి చేసింది. అతని వద్ద మారణాయుధాలు ఉన్నాయనే ప్రచారం జోరుగా సాగింది. దీంతో విషయం పోలీసులకు చేరింది. ఆటో డ్రైవర్ ఇంట్లో ఆయుధాలు ఉన్నాయన్న కారణంతో వెంటనే దర్యాప్తు ప్రారంభించారు. నిందితుడి ఇంటికి చేరుకుని తనిఖీలు చేపట్టారు. ఎంత వెతికినా ఆయుధాలు లభించలేదు. అయితే, పెద్దఎత్తున నగదు సంచులు బయటపడ్డాయి.ఓ ఆటో డ్రైవర్ ఇంట్లో ఇంత పెద్దమొత్తంలో నగదు కనిపించడంతో పోలీసులు షాక్ అయ్యారు. వెంటనే నగదు లెక్కించే యంత్రాలను తెప్పించారు. సుమారు ఐదు గంటల పాటు శ్రమించి దాని విలువ రూ.3 కోట్లుగా తేల్చి స్వాధీనం చేసుకున్నారు. అనంతరం ఈ నగదు ఎక్కడి నుంచి వచ్చిందని ఆటో డ్రైవర్ కుటుంబాన్ని పోలీసులు ప్రశ్నించారు. అయితే, ఆ డబ్బుతో తమకు ఎలాంటి సంబంధం లేదని వారు తెలిపారు. భోపాల్‌లో ప్రభుత్వ ఇంజనీర్‌గా పనిచేస్తున్న తమ బంధువు కుటుంబ సభ్యులదని వెల్లడించారు. కాగా, ఈ ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు తదుపరి దర్యాప్తు కొనసాగిస్తున్నారు.



తీరుమారని యూజీసీ నెట్ ఎగ్జామ్ రద్దు

న్యూఢిల్లీ, ఆగస్టు 17, (న్యూస్ పల్స్)యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ నేషనల్ ఎలిజిబిలిటీ టెస్ట్ జూన్ 2026 పరీక్షలకు సంబంధించి ఏకంగా మూడు సబ్జెక్టులను నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ రద్దు చేసింది. ఇంగ్లిష్, కామర్స్, సోషియాలజీ సబ్జెక్టులకు సంబంధించిన పరీక్షలను తిరిగి నిర్వహించాలని నిర్ణయించింది. ఈ మూడు పేపర్లలో పలు తప్పులు, లోపాలు ఉన్నాయంటూ అభ్యర్థుల నుంచి ఫిర్యాదులు వెల్లువెత్తడంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించింది. జూన్ 2026 పరీక్షలను జూన్ 22 నుంచి 30 వరకు నిర్వహించిన సంగతి తెలిసిందే. అనంతరం జూలై 5, 2026న రీ-టెస్ట్ నిర్వహించింది. మొత్తం 87 సబ్జెక్టులకు ఈ పరీక్షలు జరిగాయి. జూనియర్ రీసెర్చ్ ఫెలోషిప్ , అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులకు అర్హత, పీహెచ్‌డీ ప్రవేశాల కోసం ఈ పరీక్షను నిర్వహిస్తారు. అయితే ఇందులో ఇంగ్లిష్, కామర్స్, సోషియాలజీ పేపర్లలో అనేక తప్పులు ఉన్నాయని ఔంకు అభ్యర్థుల నుంచి ఫిర్యాదులు అందాయి. దీంతో ఈ లోపాలను పరిశీలించేందుకు ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేసింది. కమిటీ సమగ్రంగా పరిశీలించిన అనంతరం మూడు పేపర్లలో పలు రకాల తప్పులు ఉన్నట్లు గుర్తించింది.కమిటీ నివేదిక ప్రకారం.. ప్రశ్నపత్రాల్లో ప్రముఖ పండితుల పేర్లలో స్పెల్లింగ్ తప్పులు, పుస్తకాల పేర్లలో లోపాలు, ప్రశ్నల పదబంధాల్లో తప్పులు, వ్యాకరణ దోషాలు, లింగం-వచన అన్వయంలో పొరపాట్లు, విరామ చిహ్నాల తప్పులు ఉన్నాయి. అంతేకాకుండా ఇప్పటికే ప్రాచుర్యంలో ఉన్న భావాలకు ప్రామాణికం కాని పదాలను ఉపయోగించడం, గతంలో అడిగిన ప్రశ్నల్లో గణనీయమైన సంఖ్యలో ప్రశ్నలను మళ్లీ ఇవ్వడం వంటి లోపాలు కూడా ఉన్నట్లు కమిటీ గుర్తించింది. అభ్యర్థులందరికీ న్యాయమైన, లోపాలు లేని పరీక్షను నిర్వహించడం అవసరమని భావించిన కమిటీ.. ఇంగ్లిష్, కామర్స్, సోషియాలజీ మూడు పేపర్లను తిరిగి నిర్వహించాలని సిఫార్సు చేసింది. కమిటీ నివేదిక ఆధారంగా రీ-కండక్ట్‌కు నిర్ణయం తీసుకుంది.ఇంగ్లిష్ పరీక్ష తేదీ: సెప్టెంబర్ 9, 2026 ? షిఫ్ట్ 1, ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకుకామర్స్ పరీక్ష తేదీ: సెప్టెంబర్ 9, 2026 ? షిఫ్ట్ 2, మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకుసోషియాలజీ పరీక్ష తేదీ: సెప్టెంబర్ 10, 2026 ? షిఫ్ట్ 1, ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకుఈ మూడు సబ్జెక్టులకు చెందిన అభ్యర్థుల నుంచి రీ-కండక్ట్ పరీక్ష కోసం ఎలాంటి అదనపు పరీక్ష ఫీజు వసూలు చేయబోమని స్పష్టం చేసింది. పరీక్ష నగరం, పరీక్ష కేంద్రం, అడ్మిట్ కార్డుకు సంబంధించిన వివరాలను తదుపరి దశలో అధికారిక వెబ్‌సైట్ ద్వారా వెల్లడిస్తామని తెలిపింది. మరోవైపు సబ్జెక్టులకు సంబంధించిన ప్రొవిజనల్ ఆన్సర్ కీలను విడుదల చేసింది. ఈ 84 సబ్జెక్టులకు సంబంధించిన ఫలితాలను నిర్ణయించిన షెడ్యూల్ ప్రకారమే ప్రకటిస్తామని తెలిపింది. అలాగే ఇంగ్లిష్, కామర్స్, సోషియాలజీ సబ్జెక్టులకు రీ-కండక్ట్ పరీక్ష నిర్వహిస్తున్న కారణంగా మిగిలిన 84 సబ్జెక్టులకు సంబంధించిన సీట్ల కేటాయింపు, ఈ-సర్టిఫికెట్ల జారీ ఆలస్యం కాదని స్పష్టం చేసింది. అభ్యర్థులు రీ-కండక్ట్ పరీక్షకు సంబంధించిన తాజా సమాచారం, పరీక్ష కేంద్రం, సిటీ ఇంటిమేషన్ స్లిప్, అడ్మిట్ కార్డు వంటి వివరాల కోసం అధికారిక వెబ్‌సైట్‌ను క్రమం తప్పకుండా పరిశీలించాలని సూచించింది.

మంత్రులు కమిషన్లు అడుగుతున్నారు.. నా వద్ద ఆడియోలు ఉన్నాయి: అన్నామలై..




చెన్నై: తమిళనాడు ముఖ్యమంత్రి, తమిళగ వెట్రి కళగం (టీవీకే) అధినేత విజయ్ ప్రభుత్వంపై మాజీ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు అన్నామలై సంచలన ఆరోపణలు చేశారు. ప్రభుత్వ టెండర్లు దక్కించుకునే కాంట్రాక్టర్ల నుంచి కొందరు మంత్రులు కమిషన్లు డిమాండ్ చేస్తున్నారని ఆరోపించారు. ఇందుకు సంబంధించిన ఆడియో రికార్డులు తన వద్ద ఉన్నాయని పేర్కొన్నారు. అన్నామలై తాజా వ్యాఖ్యలు తమిళనాడు రాజకీయాలను ఒక్కసారిగా వేడెక్కించాయి.చెన్నైలో నిన్న (ఆదివారం) నిర్వహించిన పర్యావరణ అవగాహన కార్యక్రమంలో అన్నామలై పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రులపై కీలక వ్యాఖ్యలు చేశారు. ముఖ్యమంత్రి విజయ్ అవినీతికి వ్యతిరేకంగా స్పష్టమైన వైఖరితో ఉన్నారని, కానీ కొందరు మంత్రుల వ్యవహారశైలి అందుకు విరుద్ధంగా ఉందని ఆరోపించారు. గతంలో కీలక టెండర్ల విషయంలో కమిషన్ల డిమాండ్లు లేవని, ఇప్పుడు కొందరు మంత్రులు కాంట్రాక్టర్ల నుంచి వాటాలు అడుగుతున్నారని విమర్శలు గుప్పించారు. ఎన్నికల సమయంలో తాము డబ్బులు ఖర్చు చేశామని చెబుతూ.. కాంట్రాక్టర్ల నుంచి వసూళ్లకు పాల్పడుతున్నారని అన్నామలై ఆరోపించారు. రెండు శాతం ఇవ్వాలని, మూడు శాతం ఇవ్వాలని, అవసరమైతే నాలుగు శాతం ఇవ్వాలని అడుగుతున్నట్లుగా ఆడియో రికార్డులు తన వద్ద ఉన్నాయని అన్నారు.ఈ సందర్భంగా మంత్రులు, ఉన్నతాధికారులపై ముఖ్యమంత్రి విజయ్ మరింత నిఘా పెట్టాలని అన్నామలై సూచించారు. ప్రభుత్వం అవినీతి రహిత పాలనను లక్ష్యంగా పెట్టుకున్నప్పుడు, కిందిస్థాయిలో జరుగుతున్న అక్రమాలపైనా కఠినంగా వ్యవహరించాల్సిన అవసరం ఉందన్నారు. కాగా, విజయ్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన కొద్ది కాలానికే అవినీతి ఆరోపణలు రావడం రాజకీయంగా ప్రాధాన్యం సంతరించుకుంది. టెండర్లు, కాంట్రాక్టుల విషయంలో మంత్రులు నిజంగా కమిషన్ల అడిగారా, లేదా? అన్నది ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. మరోవైపు, అన్నామలై వ్యాఖ్యలపై విజయ్ ప్రభుత్వం ఏ విధంగా స్పందిస్తుందనేది వేచి చూడాలి.

విద్యార్థులు, పరిశ్రమలను కలిపే జాబ్ పోర్టల్.. దేశంలోనే తొలిసారి: మంత్రి వివేక్

మెదక్, ఆగస్టు 17: దేశంలోనే మొదటిసారిగా పరిశ్రమలను విద్యార్థులను జాబ్ పోర్టల్ కనెక్ట్ చేస్తుందని మంత్రి వివేక్ వెంకటస్వామి తెలిపారు. జిల్లాలోని మనోహరాబాద్ మండలం ముప్పిరెడ్డిపల్లిలోని పారిశ్రామిక ప్రాంతంలో జాబ్ పోర్టల్‌ను మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఈ ప్రాంతంలో వెయ్యి పరిశ్రమలు ఉన్నాయని.. స్కిల్డ్ మ్యాన్ పవర్ అవసరం ఉందని అన్నారు. జిల్లా యంత్రాంగం, పరిశ్రమల యజమానులు కలిసి చేస్తున్న మంచి ప్రయత్నం ఇది అని చెప్పుకొచ్చారు. ఈ ప్రాంతంలో, దేశంలో నిరుద్యోగం పెద్ద సమస్యగా మారిందన్నారు. టామ్ కామ్ సంస్థ ద్వారా విదేశాల్లో ఉపాధి అవకాశాలను కల్పిస్తున్నామన్నారు.స్థానిక పరిశ్రమలకు కూడా ఉద్యోగులను, స్కిల్డ్ లేబర్‌ను అందించాల్సిన అవసరం ఉందని చెప్పారు. విద్యార్థులు కేవలం సాఫ్ట్‌వేర్ పైనే దృష్టి సారించకుండా... ఇంకా చాలా రంగాల్లో కూడా మంచి అవకాశాలు ఉన్నాయని అన్నారు. సింగరేణి ప్రాంతం మందమర్రిలో జర్మన్ నేర్పిస్తున్నామని.. వారిలో బీ2 లెవల్ వచ్చిందన్నారు. వారి కోసం రూ.25 లక్షల జీతం ఎదురుచూస్తోందని తెలిపారు. వీసా ఖర్చులను కూడా సగం వరకూ ప్రభుత్వమే భరిస్తోందని తెలిపారు. విదేశాలకు వెళ్తే ఎన్నో కుటుంబాలు బాగుపడతాయని మంత్రి వివేక్ వెంకటస్వామి పేర్కొన్నారు.



ఇంట్లోనే ఆధార్ లింక్‌డ్ మొబైల్ నంబర్‌ను మార్చుకోండి.. అదెలాగంటే..



ప్రస్తుత కాలంలో ఆధార్ కార్డు చాలా కీలకం అని చెప్పాలి. ప్రభుత్వ పథకాలు, ప్రభుత్వేతర పనులు, ఆర్థిక లావాదేవీలు.. ఇలా ఒకటేమిటి.. చాలా పనులకు ఆధార్ అవసరంగా మారిపోయింది. అందుకే.. చాలా మంది ఎల్లప్పుడూ తమ వెంట ఆధార్ తీసుకెళ్తుంటారు. ఆధార్ కార్డులో సదరు వ్యక్తికి సంబంధించిన సమస్త సమాచారం నిక్షిప్తమై ఉంటుంది. 12 అంకెలు గల ఆధార్ నంబర్‌లో వ్యక్తికి సంబంధించిన పూర్తి వివరాలు ఉంటాయి. ఆధార్ కార్డుకు మొబైల్ నంబర్ కూడా లింక్ చేస్తారు. ఇలా లింక్ చేయడం వలన ఆధార్ వినియోగాన్ని మరింత సురక్షితం చేసే అవకాశం ఉంటుంది. చాలా మంది తమ ఆధార్ కార్డుకు తమ మొబైల్ నంబర్ కాకుండా కుంటుంబంలో ఇతరుల మొబైల్ నెంబర్‌ను లింక్ చేస్తుంటారు. మీరు కూడా అలాగే చేశారా? మీ ఆధార్ కార్డుకు.. మీ మొబైల్ నంబర్‌ను లింక్ చేయాలనుకుంటున్నారా? ఇందుకోసం మీరు ఎక్కడికీ వెళ్లాల్సిన పని లేదు. జస్ట్ ఇంట్లోనే కూర్చొని మీ ఆధార్ లింక్‌డ్ మొబైల్ నంబర్‌ను అప్‌డేట్ చేసుకోవచ్చు. అదెలాగో స్టెప్ టు స్టెప్ వివరాలు ఇప్పుడు తెలుసుకుందాం..

ఆధార్ లింక్‌డ్ మొబైల్ నెంబర్ అప్‌డేట్ చేసే విధానం ఇలా..

స్టెప్ - 1

కొత్త ఆధార్ యాప్‌ను ఉపయోగించి ఆధార్‌కు అనుసంధానించిన మొబైల్ నంబర్‌ను మార్చుకోవచ్చు.

ముందుగా కొత్త ఆధార్ యాప్‌ను డౌన్‌లోడ్ చేసి, ఆపై ఇన్‌స్టాల్ చేసుకోవాలి.

ఆ తరువాత ఈ యాప్‌లోకి లాగిన్ అవ్వాలి. ఇందుకోసం ఆధార్ నంబర్‌ను ఎంటర్ చేయాలి.

స్టెప్ - 2

ఆ తరువాత ఫేస్ అథెంటికేషన్ ద్వారా యాప్‌లోకి లాగిన్ అవ్వొచ్చు.

లాగిన అయిన తరువాత యాప్‌లో చాలా ఆప్షన్లు కనిపిస్తాయి. సర్వీసెస్ ఆప్షన్‌పై క్లిక్ చేయాలి.

ఆ తర్వాత అక్కడ మొబైల్ నంబర్ అప్‌డేట్ అనే ఆప్షన్‌పై క్లిక్ చేయాలి.

స్టెప్ - 3

ఆ తర్వాత మొబైల్ నంబర్‌ను అప్‌డేట్ చేయడానికి కొనసాగించు ఆప్షన్‌పై క్లిక్ చేయాలి.

ఆధార్‌తో అనుసంధానం చేయాలనుకుంటున్న మీ మొబైల్ నంబర్‌ను ఎంటర్ చేయాలి.

ఇప్పుడు ఎంటర్ చేసిన మొబైల్ నంబర్‌కు ఓఖ వస్తుంది, దానిని ఇక్కడ ఎంటర్ చేయాలి.

స్టెప్ - 4

ఇప్పుడు మీరు ఫేస్ రికగ్నిషన్ (ఫేస్ ధృవీకరణ) చేసుకోవాలి.

ఆ తర్వాత రూ. 75 ఆన్‌లైన్ ఫీజు చెల్లించాలి.

ఫీజులు చెల్లించిన తర్వాత సమర్పించండి(ప్రొబీఎఎతిబి) ఆప్షన్‌పై క్లిక్ చేయాలి.

15 రోజుల్లోగా మీ కొత్త మొబైల్ నంబర్ ఆధార్‌లో అప్‌డేట్ అవుతుంది.

గమనిక: ఇక్కడ గమనించాల్సిన విషయం ఏంటంటే.. ప్రస్తుతం ఆధార్‌కు లింక్ అయిన మొబైల్ నంబర్ పని చేస్తున్నట్లయితే మీరు ఆధార్ యాప్ ద్వారా కొత్త మొబైల్ నెంబర్ అప్‌డేట్ చేసుకోవడానికి అవకాశం ఉంటుంది. ఒకవేళ ఆ నంబర్ మనుగడలో లేకపోయినట్లయితే.. కొత్త మొబైల్ నంబర్ లింక్ చేయడం కోసం ఆధార్ సేవా కేంద్రానికి వెళ్లాల్సి ఉంటుంది.

హైదరాబాద్‌లో దృష్టి మళ్లించి బంగారు ఆభరణాల చోరీ.. ఆరుగురి అరెస్ట్

హైదరాబాద్, ఆగస్టు 17: నగరంలో గత కొంత కాలంగా అమాయకుల దృష్టి మళ్లించి బంగారు ఆభరణాల చోరీలకు పాల్పడుతున్న ముఠా గుట్టును లంగర్‌హౌస్ పోలీసులు ఛేదించారు. ఆరుగురు నిందితులను అరెస్ట్ చేసి, వారి నుంచి భారీగా బంగారు ఆభరణాలు, నగదు, వాహనాలు, సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నిందితులు అమాయకులను టార్గెట్ చేసుకొని వారి దృష్టిని మళ్లించి విలువైన వస్తువులు, బంగారు ఆభరణాలను అపహరిస్తున్నారు. వరుసగా జరుగుతున్న చోరీలపై దర్యాప్తు చేపట్టిన పోలీసులు.. సీసీటీవీ టీవీ ఫుటేజీలను పరిశీలించి, నిందితుల కదలికలను గుర్తించారు. ఆధారాలను సేకరించిన అనంతరం ఆరుగురిని అదుపులోకి తీసుకుని విచారించగా.. దృష్టి మళ్లించి చోరీలకు పాల్పడినట్లు అంగీకరించినట్లు పోలీసులు తెలిపారు. పోలీసులు అరెస్ట్ చేసిన వారిలో సయ్యద్ అసద్, ఒమర్ ఖాన్, సయ్యద్ మొయిన్, అజర్ హుస్సేన్, మహ్మద్ ఇబ్రహీం, సయ్యద్ అబ్దుల్ మజీద్ ఉన్నారు.అరెస్టైన నిందితుల నుంచి మొత్తం 13.5 తులాల బంగారు ఆభరణాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఇందులో నాలుగు బంగారు గాజులు, మూడు బంగారు గొలుసులు, ఒక లాకెట్, మూడు ఉంగరాలు ఉన్నాయి. వీటితో పాటు రూ.7.40 లక్షల నగదును కూడా స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు వెల్లడించారు. చోరీలకు ఉపయోగించినట్లు అనుమానిస్తున్న ఆటో, ఒక ద్విచక్ర వాహనం, ఆరు సెల్‌ఫోన్లను కూడా పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. అరెస్టైన నిందితుల్లో కొందరిపై గతంలోనే వివిధ పోలీస్ స్టేషన్ల పరిధిలో షీటర్ కేసులు ఉన్నట్లు పోలీసుల దర్యాప్తులో వెల్లడైంది.



ఆదాయపు పన్ను కార్యాలయం భవనంలో అగ్నిప్రమాదం.. చిక్కుకున్న ఉద్యోగులు



ముంబై: ఆదాయపు పన్ను కార్యాలయం భవనంలో అగ్నిప్రమాదం సంభవించింది. బేస్‌మెంట్ ఏరియా, గ్రౌండ్ ఫ్లోర్‌లో మంటలు చెలరేగాయి. దీంతో పై అంతస్తుల్లో ఉన్న ఉద్యోగులు అక్కడ చిక్కుకుపోయారు. (ఫైర్ సిబ్బంది వెంటనే అక్కడకు చేరుకుని మంటలను ఆర్పడంతో పాటు ఆ ఉద్యోగులను రక్షించారు. మహారాష్ట్ర రాజధాని ముంబైలో ఈ సంఘటన జరిగింది. సోమవారం మధ్యాహ్నం 2 గంటల సమయంలో చర్చిగేట్ ప్రాంతంలోని మహర్షి కర్వే రోడ్డులో ఉన్న ఇన్‌కమ్‌టాక్స్ భవనంలో అగ్నిప్రమాదం సంభవించింది. ఏడు అంతస్తులున్న ఈ బిల్డింగ్‌లోని బేస్‌మెంట్, ఫస్ట్ ఫ్లోర్ వరకు మంటలు వ్యాపించాయి. దీంతో పై అంతస్తుల్లో ఉన్న ఉద్యోగులు అక్కడ చిక్కుకుపోయారు.కాగా, ఈ అగ్నిప్రమాదం గురించి తెలిసిన వెంటనే అగ్నిమాపక, అత్యవసర వాహనాలతో ఫైర్ సిబ్బంది అక్కడకు చేరుకున్నారు. సహాయక చర్యలు చేపట్టారు. ఒక బృందం మంటలు ఆర్పడంలో నిమగ్నం కాగా, పై అంతస్తుల్లో చిక్కుకున్న ఉద్యోగులను మరో టీం రక్షించింది. నిచ్చెనల ద్వారా పైకి చేరుకున్న ఫైర్ సిబ్బంది వారిని సురక్షితంగా బయటకు తీసుకువచ్చారు.మరోవైపు ఈ అగ్ని ప్రమాదంలో ఎవరికీ ఎలాంటి గాయాలు లేదా ప్రాణనష్టం జరుగలేదని ఫైర్ అధికారులు తెలిపారు. ఆదాయపు పన్ను కార్యాలయంలో అగ్నిప్రమాదానికి గల కచ్చితమైన కారణం ఇంకా తెలియలేదని చెప్పారు. దీనిపై దర్యాప్తు చేస్తున్నట్లు ఫైర్ అధికారులు వెల్లడించారు.

బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శిగా స్మృతి ఇరానీ



న్యూఢిల్లీ: భారతీయ జనతా పార్టీ కొత్త టీమ్‌ను ప్రకటించింది. అనేక మంది ముఖ్య నేతలకు.. పార్టీలో కీలక బాధ్యతలు అప్పగించారు. మాజీ కేంద్ర మంత్రి స్మృతి ఇరానీ పార్టీ కేంద్ర కార్యవర్గంలో చోటు దక్కించుకున్నారు. జాతీయ ప్రధాన కార్యదర్శిగా స్మృతి ఇరానీ పేరును ప్రకటించారు. ఇక రాజస్థాన్ మాజీ సీఎం వసుంధరా రాజే, బయజయంత్ జయ పాండా, రేఖా వర్మ, తారిక్ మన్సూరులు.. జాతీయ ఉపాధ్యక్షులుగా నియమితులయ్యారు. వినోద్ తవడే, సునిల్ భన్సల్ మాత్రం జాతీయ ప్రధాన కార్యదర్శులుగా కొనసాగనున్నారు. జాతీయ ప్రధాన కార్యదర్శిగా బీఎల్ సంతోష్ యదావిధిగా కొనసాగనున్నారు. జాతీయ ప్రధాన కార్యదర్శిగా అనిల్ అంథోనీ కొనసాగుతారు. 13 మంది జాతీయ ఉపాధ్యక్షుల్లో ప్రస్తుతం ఆరు మంది మహిళలు ఉన్నారు.కానీ జాతీయ ప్రధాన కార్యదర్శుల్లో కేవలం స్మృతి ఇరానీ ఒక్కరు మాత్రమే ఏకైక మహిళా నేత. బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబిన్ తాజా నియామకాలపై ప్రకటన చేశారు. తక్షణమే ఈ మార్పులు అమలులోకి రానున్నాయి. మాజీ జాతీయ ప్రధాన కార్యదర్శి రామ్ మాధవ్‌ను జాతీయ ఉపాధ్యక్షుడిగా నియమించారు. జాతీయ ఉపాధ్యక్ష పదవుల్లో ఉత్తరాఖండ్ మాజీ సీఎం తీర్థ సింగ్ రావత్, డీ పురంధీశ్వరి, వర్షాబెన్ నరేంద్రభాయ్ దోషి, భారతి ప్రవీణ్ పవార్, మన్‌ప్రీత్ సింగ్ బాదల్, లాల్ సింగ్ ఆర్యా, ఎం నాగరాజ, మధుచంద్ర కార్ ఉన్నారు. జాతీయ ప్రధాన కార్యదర్శుల్లో స్మృతి ఇరానీతో పాటు వినోద్ తవడే, సునిల్ భన్సల్, బిప్లబ్ కుమార్ దేబ్, సతీశ్ పూనియా, గజేంద్ర పటేల్, హరీశ్ ద్వివేది, సంజయ్ భాటియా ఉన్నారు.2024 లోక్‌సభ ఎన్నికల్లో ఓడిన తర్వాత.. స్మృతి ఇరానీకి సంస్థాగతంగా తొలిసారి కీలక బాధ్యతలు అప్పగించారు. కాంగ్రెస్ పార్టీ మాజీ ప్రతినిధి రోహన్ గుప్తాకు.. బీజేపీ జాతీయ కార్యదర్శిగా హోదా ఇచ్చారు. కేంద్ర మంత్రి పీయూష్ గోయల్.. బీజేపీ జాతీయ కోశాధికారి బాధ్యతలు దక్కించుకున్నారు. రాజేశ్ మంగల్‌కు జాతీయ సంయుక్త కోశాధికారి పదవి దక్కింది. పలు రాష్ట్రాల్లో రాబోయే అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో.. పార్టీ పరంగా బీజేపీ మార్పులు చేపట్టింది.

మొక్కలతో మన భవిష్యత్ : షీ టీం ఎస్ఐ రమాదేవి

రుద్రంపూర్, ఆగస్టు 17 : నేతాజీ రామవరం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో నిర్వహిస్తున్న “నా మొక్క.. నా బాధ్యత” కార్యక్రమంలో షీ టీం ఎస్ఐ రమాదేవి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు మొక్కల సంరక్షణతో పాటు వ్యక్తిగత భద్రత, అత్యవసర సమయాల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ.. “మొక్కను నాటడం అంటే కేవలం ఒక మొక్కను భూమిలో నాటడం కాదని మన భవిష్యత్‌ను నాటడం” అన్నారు. ప్రతి విద్యార్థి ఒక మొక్కను నాటి, దానిని స్నేహితుడిలా భావించి సంరక్షించాలని సూచించారు. పిల్లల భద్రతపై అవగాహన కల్పిస్తూ సేఫ్ టచ్, అన్‌సేఫ్ టచ్ గురించి వివరించారు. ఎవరైనా వేధించినా, అసభ్యకరంగా ప్రవర్తించినా, వెంటపడినా లేదా బెదిరించినా భయపడకుండా వెంటనే తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు లేదా పోలీసులకు సమాచారం అందించాలని చెప్పారు. సమస్యలను మనసులో పెట్టుకుని మౌనంగా ఉండకూడదన్నారు. అత్యవసర పరిస్థితుల్లో డయల్ 112 సేవలను వినియోగించుకోవాలని సూచించారు.

లక్షలాది కుటుంబాలకు అండగా కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ : ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి



వేల్పూర్ : తెలంగాణలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయకపోగా, గత బీఆర్ఎస్ ప్రభుత్వం పేదలు, మహిళలు, రైతులు, వృద్ధుల కోసం అమలు చేసిన సంక్షేమ పథకాలను కూడా నిర్వీర్యం చేస్తోందని మాజీ మంత్రి, బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి తీవ్రంగా విమర్శించారు. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్, వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపు మేరకు కాంగ్రెస్ ప్రభుత్వం కల్యాణ లక్ష్మి పథకం రద్దు చేయడానికి చేస్తున్న కుట్రలను నిరసిస్తూ నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. అనంతరం ప్రజల డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని మహిళలతో కలిసి ఓఖీకి అందజేశారు.ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి మాట్లాడుతూ.. పేదింటి ఆడబిడ్డల వివాహ భారం తగ్గించేందుకు కేసీఆర్ ప్రభుత్వం ప్రారంభించిన కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాలు తెలంగాణలో లక్షలాది కుటుంబాలకు అండగా నిలిచాయని తెలిపారు. కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాలు గత పదేళ్లుగా విజయవంతంగా అమలవుతున్నప్పటికీ, ప్రస్తుతం ప్రభుత్వం వారి అనుకూలమైన వ్యక్తితో కోర్టులో కేసు వేయించి ఈ పథకాన్ని రద్దు చేయాలన్న కుట్రలు చేస్తుంది. కోర్టు కేసుల పేరుతో కాలయాపన చేయకుండా ఈ పథకాలను కొనసాగిస్తామని ప్రభుత్వం కోర్టులో స్పష్టమైన అఫిడవిట్ ఎందుకు దాఖలు చేయడం లేదు..? అని ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి ప్రశ్నించారు.వచ్చే విచారణలో ప్రభుత్వం తన వైఖరిని స్పష్టంగా వెల్లడించి, కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాలను ఎలాంటి ఆటంకం లేకుండా కొనసాగిస్తామని ప్రకటించాలని ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి డిమాండ్ చేశారు. కల్యాణలక్ష్మి పథకం తొలుత ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ వర్గాలకు రూ.50,000 సహాయంతో ప్రారంభమై, అనంతరం బీసీలతో పాటు అన్ని వర్గాల పేదలకు విస్తరించిందని వేముల గుర్తుచేశారు. ఆర్థిక సహాయాన్ని దశలవారీగా పెంచుతూ చివరకు రూ.1,00,116కు చేర్చిన ఘనత కేసీఆర్ ప్రభుత్వానిదేనన్నారు. రాష్ట్రవ్యాప్తంగా సుమారు 13 లక్షల మంది ఆడబిడ్డల వివాహాలకు దాదాపు రూ.13 వేల కోట్ల ఆర్థిక సహాయం అందించిన కేసీఆర్ ప్రభుత్వం పేదింటి ఆడబిడ్డలకు మేనమామలా అండగా నిలిచిందని పేర్కొన్నారు.ఎన్నికల సమయంలో కల్యాణలక్ష్మి ఆర్థిక సాయంతోపాటు తులం బంగారం ఇస్తామని కాంగ్రెస్ హామీ ఇచ్చిందని, అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ హామీని పూర్తిగా విస్మరించిందని వేముల ప్రశాంత్ రెడ్డి విమర్శించారు. కల్యాణలక్ష్మి చెక్కులు అందుకున్న ప్రతి అర్హురాలికి ఎన్నికల హామీ మేరకు తులం బంగారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. కల్యాణలక్ష్మి, తులం బంగారం వంటి హామీలను అమలు చేయాలని ప్రశ్నించిన బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలపై పోలీసులు కేసులు పెట్టారు అని వేముల అన్నారు.కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాలను యథావిధిగా కొనసాగించాలని డిమాండ్ చేశారు. కోర్టులో ప్రభుత్వం తన వైఖరిని స్పష్టంగా వెల్లడించి, పథకాల కొనసాగింపుపై అఫిడవిట్ దాఖలు చేయాలి. ఎన్నికల హామీ మేరకు కల్యాణలక్ష్మి లబ్ధిదారులకు తులం బంగారం అందించాలన్నారు.

బీజేపీ జాతీయ నూతన కార్యవర్గం..

పురందేశ్వరికి కీలక పదవి..



న్యూఢిల్లీ: బీజేపీ అధిష్ఠానం పార్టీ నూతన జాతీయ కార్యవర్గాన్ని ప్రకటించింది. బీజేపీ జాతీయ ఉపాధ్యక్షులుగా పురందేశ్వరి, వసుంధరా రాజె, రామ్ మాధవ్ సహా 13 మంది పేర్లను ప్రకటించారు. బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శిగా స్మృతి ఇరానీని ప్రకటించారు. పార్టీ జాయింట్ కోఆర్డినేటర్‌గా విష్ణువర్ధన్‌రెడ్డిని నియమించారు. కేంద్ర కార్యాలయ ఇన్‌ఛార్జ్‌గా తరుణ్ చుగ్, ాఃఅ మోర్చా నూతన అధ్యక్షుడిగా అమర్‌పాల్ మౌర్య పేర్లను ప్రకటించింది పార్టీ అధిష్ఠానం. అలాగే, సంస్థాగత జనరల్ సెక్రటరీగా ఒ.ఒ.సంతోష్, సంస్థాగత జాయింట్ జనరల్ సెక్రటరీగా శివప్రకాష్ పేర్లను ఖరారు చేసింది బీజేపీ అధినాయకత్వం. కాగా, బీజేపీ జాతీయ కార్యవర్గంలో తెలంగాణకు చోటు దక్కలేదు. పైగా ఉపాధ్యక్షురాలిగా ఉన్న డీకే అరుణను తప్పించారు.

13 మంది బీజేపీ జాతీయ ఉపాధ్యక్షులు వీరే..

1. వసుంధర రాజే సింధియా – రాజస్థాన్2. తీరథ్ సింగ్ రావత్ – ఉత్తరాఖండ్3. రామ్ మాధవ్ – ఢిల్లీ4. బైజయంత్ జయ్ పాండా – ఒడిశా5. డి. పురందేశ్వరి – ఆంధ్రప్రదేశ్6. రేఖా వర్మ – ఉత్తరప్రదేశ్7. వర్షాబెన్ నరేంద్రభాయ్ – గుజరాత్8. డా. భారతి ప్రవీణ్ పవార్ – మహారాష్ట్ర9. సర్దార్ మన్‌ప్రీత్ సింగ్ బాదల్ – పంజాబ్10. లాల్ సింగ్ ఆర్య – మధ్యప్రదేశ్11. ప్రొఫెసర్ ఎం. నాగరాజా – కర్ణాటక12. ప్రొఫెసర్ తారిఖ్ మన్సూర్ – ఉత్తరప్రదేశ్13. డా. మధుచంద్ర కర్ – పశ్చిమ బెంగాల్జాతీయ ప్రధాన కార్యదర్శి (సంస్థాగతం)

1. బీఎల్ సంతోష్ – ఢిల్లీజాతీయ సంయుక్త ప్రధాన కార్యదర్శులు (సంస్థాగతం)1. శివప్రకాశ్ – ముంబై2. సౌదాన్ సింగ్ – చండీగఢ్జాతీయ ప్రధాన కార్యదర్శులు1. వినోద్ తావ్డే – మహారాష్ట్ర2. సునీల్ బన్సల్ – ఢిల్లీ3. బిప్లబ్ కుమార్ దేబ్ – త్రిపుర4. స్మృతి ఇరానీ – ఉత్తరప్రదేశ్5. డా. సతీష్ పూనియా – రాజస్థాన్6. గజేంద్ర పటేల్ – మధ్యప్రదేశ్7. హరీష్ ద్వివేది – ఉత్తరప్రదేశ్8. సంజయ్ భాటియా – హరియాణాజాతీయ కార్యదర్శులు1. కవితా పాటిదార్ – మధ్యప్రదేశ్2. కే. సురేంద్రన్ – కేరళ3. డా. భోలా సింగ్ – ఉత్తరప్రదేశ్4. డా. ప్రదీప్ వర్మ – జార్ఖండ్5. జగదీశ్ ఈశ్వరభాయ్ పటేల్ – గుజరాత్6. డా. సందీప్ పాఠక్ – ఢిల్లీ7. ఫాంగ్నోన్ కోన్యాక్ – నాగాలాండ్8. సంగీతా యాదవ్ – ఉత్తరప్రదేశ్9. అనిల్ ఆంటోనీ – కేరళ10. డా. ఎం. వెంకటేశన్ – తమిళనాడు11. మనోజ్ టిగ్గా – పశ్చిమ బెంగాల్12. సిద్ధార్థ్ శంభు – బీహార్13. డా. స్వదేశ్ సింగ్ – ఢిల్లీ14. మృగాంక్ దేవ్ బర్మన్ – అసోం15. రోహన్ గుప్తా – గుజరాత్16. జై ప్రకాశ్ – ఢిల్లీజాతీయ కోశాధికారి1. పీయూష్ గోయల్ – మహారాష్ట్రజాతీయ సంయుక్త కోశాధికారి

1. రాజేష్ మంగళ్ – రాజస్థాన్

పలు రాష్ట్రాల్లో ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబిన్ నేతృత్వంలో నూతన కార్యవర్గాన్ని ప్రకటించింది. అనుభవజ్ఞులైన నాయకులు, యువ నాయకుల సమ్మేళనంతో జాతీయ కార్యవర్గంలో ప్రాంతీయ ప్రాతినిధ్యానికి అధిక ప్రాధాన్యతనిచ్చారు. బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శులలో ఒకరిగా మాజీ కేంద్ర మంత్రి స్మృతి ఇరానీ కీలక సంస్థాగత పాత్రలోకి తిరిగి రావడం ఒక పెద్ద పరిణామం. తెరపైకి వచ్చిన మరో కీలక పేరు రాజస్థాన్ మాజీ ముఖ్యమంత్రి వసుంధర రాజే. 13 మంది జాతీయ ఉపాధ్యక్షులలో ఆరుగురు మహిళలు ఉండటం, పార్టీ కీలక పదవులలో మహిళలకు మరింత ప్రాతినిధ్యం కల్పించాలనే ప్రయత్నాన్ని సూచిస్తుంది. ఈ నియామకాలు దక్షిణ, తూర్పు రాష్ట్రాల వైపు మొగ్గు చూపుతున్న ధోరణిని సూచిస్తున్నాయి. కేరళ, పశ్చిమ బెంగాల్, ఒడిశా, ఈశాన్య రాష్ట్రాల నాయకులకు కీలక పదవులు లభించాయి.

జాతీయ రహదారిపై బీఆర్ఎస్ శ్రేణుల ధర్నా

తాండూర్ : కాంగ్రెస్ ప్రభుత్వం కొత్త పథకాలు ప్రారంభించ కుండా ఉన్న సంక్షేమ పథకాలు కొనసాగించలేని దుస్థితికి దిగజార్చిందని బీఆర్ఎస్ నాయకులు ఆరోపించారు. సోమవారం తాండూర్ మండల కేంద్రంలోని జాతీయ రహదారిపై ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాలను కాంగ్రెస్ ప్రభుత్వం కావాలనే నిలిపివేసే కుట్రలు పన్నుతోందని ఆరోపించారు.ప్రభుత్వం ఇచ్చిన హామీల్లో ఒక్కటి కూడా నిలబెట్టుకోలేకపోతుందని విమర్శించారు. కొత్త పింఛన్లు ప్రారంభించకుండా రేపుమాపు అంటూ దాటవేస్తోందని ఆరోపించారు.కల్యాణలక్ష్మి, షాదీముబారక్ లాంటి పథకాలతో ఎంతో మంది పేద కుటుంబాలకు ఆడపిల్లల పెళ్లిల్లకు ఎంతో అండగా ఉండేవని తెలిపారు. అనంతరం అధికారులకు వినతి పత్రం అందజేశారు.ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు సుబ్బ దత్తుమూర్తి, నాయకులు పూసాల ప్రణయ్ కుమార్, మంగపతి సురేష్ బాబు, గట్టు సంతోష్ కుమార్, ఎలుక రామచందర్, మాసాడి శ్రీరాములు, బోడ సతీష్, జాడి పోశం, అద్వాల సత్యనారాయణ, బాబుఖాన్,ఇక్బాల్, చింటూ, దుగ్యాల ప్రదీప్ రావు, క్రాంతి కుమార్, శ్రీనివాస్, చోదన్,కోల జ్యోతి, ఎరుకల రాజమణి, గుండేటి లక్ష్మి ,తదితరులు పాల్గొన్నారు.

డ్రగ్స్ పరీక్షలో ఇద్దరు ఎయిర్ ఇండియా గ్రూపు పైలట్లు విఫలం



న్యూఢిల్లీ: ఎయిర్ ఇండియా గ్రూపు పైలట్లకు డ్రగ్స్ పరీక్ష నిర్వహించారు. ఆ పరీక్షల్లో ఇద్దరు పైలట్లు నాన్-నెగటివ్‌గా తేలారు. దీంతో ఆ ఇద్దరు శ్యాంపిళ్లకు ద్రువీకరణ పరీక్షలు నిర్వహించనున్నారు. ఆగస్టు 13వ తేదీన ఎయిర్ ఇండియాతో పాటు ఎయిర్ ఇండియా ఎక్స్‌ప్రెస్ సంస్థ తమ పైలట్లకు డ్రగ్స్ పరీక్ష నిర్వహించాయి. పైలట్లు అందరికీ సైకోయాక్టివ్ సబ్స్‌టెన్స్ కోసం టెస్టింగ్ చేశారు. ప్రస్తుతం అమలులో ఉన్న నిబంధనలకు అదనంగా ఈ పరీక్ష చేపట్టారు. ఆగస్టు 4వ తేదీన జరిగిన ఘటన నేపథ్యంలో పైలట్లు అకస్మికంగా డ్రగ్స్ పరీక్ష చేపట్టారు.థాయ్‌ల్యాండ్‌లోని పుకెట్ నుంచి ఢిల్లీ వస్తున్న విమానంలో భారీ కుదుపులు జరిగిన విషయం తెలిసిందే. అయితే ఆ విమాన పైలట్ ఒకరు మారిజోనా మాదకద్రవ్యం తీసుకున్నట్లు తేలింది. ఇక ఎయిర్ ఇండియా గ్రూపులో సోమవారం నాటికి సుమారు 400 మంది పైలట్లకు డ్రగ్స్ పరీక్షలు పూర్తి అయినట్లు ఓ అధికారి ద్వారా తెలిసింది. ప్రాథమిక పరీక్షల్లో ఇద్దరు మాత్రమే నాన్-నెగటివ్‌గా వచ్చినట్లు తెలిసింది. అయితే పూర్తి వివరాలను మాత్రం వెల్లడించలేదు. ఎయిర్ ఇండియా నుంచి మాత్రం అధికారిక ప్రకటన ఇంకా రాలేదు.ప్రస్తుతం టాటా గ్రూపు ఆధీనంలో ఉన్న రెండు ఎయిర్‌లైన్స్ సంస్థల్లో సుమారు 5వేల మంది పైలట్లుకు పైగా ఉన్నారు. డ్రగ్స్ పరీక్షల్లో భాగంగా ప్రస్తుతం ఏవియేషన్ నిబంధనల ప్రకారం నిషేధం ఉన్న ఉత్ప్రేరకాలు ఏమైనా పైలట్లు తీసుకుంటున్నారా లేదా అని పరీక్షిస్తున్నారు.

రాహుల్ గాంధీకి ఊరట.. ఆస్తుల కేసులో సుప్రీంకోర్టు కీలక ఆదేశాలు..



న్యూఢిల్లీ ,కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీకి సుప్రీంకోర్టులో ఊరట లభించింది. ఆదాయానికి మించిన ఆస్తుల ఆరోపణల కేసులో సుప్రీంకోర్టు కీలక ఆదేశాలు జారీ చేసింది. ఈ వ్యవహారంపై అలహాబాద్ హైకోర్టులో కొనసాగుతున్న విచారణను తదుపరి ఆదేశాలు వచ్చే వరకు నిలిపివేయాలని ఆదేశించింది. అలాగే ఈ కేసులో సీబీఐ, ఈడీ ఎలాంటి నివేదికను ప్రస్తుతం అలహాబాద్ హైకోర్టుకు సమర్పించకూడదని స్పష్టం చేసిందిరాహుల్ గాంధీ దాఖలు చేసిన పిటిషన్‌ను ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్, న్యాయమూర్తులు జాయ్‌మాల్య బాగ్చి, వి. మోహనాలతో కూడిన ధర్మాసనం విచారించింది. అలహాబాద్ హైకోర్టు ఇప్పటికే ఈ కేసులో తదుపరి విచారణను ఆగస్టు 20న చేపట్టనుంది. అయితే హైకోర్టు విచారణను తదుపరి ఆదేశాల వరకు వాయిదా వేయాలని తాజాగా సుప్రీంకోర్టు ఆదేశించింది. ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ తమ దర్యాప్తు లేదా పరిశీలనకు సంబంధించిన ఎలాంటి నివేదికను హైకోర్టుకు సమర్పించకుండదని పేర్కొందిరాహుల్ గాంధీ ఆదాయానికి మించిన ఆస్తులు కలిగి ఉన్నారని కర్ణాటకకు చెందిన బీజేపీ కార్యకర్త విఘ్నేశ్ శిశిర్ చేసిన ఫిర్యాదు ఆధారంగా ఈ వ్యవహారం అలహాబాద్ హైకోర్టుకు వెళ్లింది రాహుల్ గాంధీ ఆదాయానికి మించిన ఆస్తులు కలిగి ఉన్నారనే ఆరోపణలను పరిశీలించాలని సీబీఐ, ఈడీకి హైకోర్టు గతంలో సూచించింది. ఈ ఆదేశాలను రాహుల్ గాంధీ సుప్రీంకోర్టులో సవాల్ చేశారు. అంతేకాకుండా ఈ కేసు విచారణను అలహాబాద్ హైకోర్టు నుంచి ఢిల్లీ హైకోర్టుకు బదిలీ చేయాలని ప్రత్యేక పిటిషన్ కూడా దాఖలు చేశారు.

దేశవ్యాప్తంగా ఎంపీలు, ఎమ్మెల్యేలపై 4,1ి2 క్రిమినల్ కేసుల పెండింగ్

న్యూఢిల్లీ, ఆగస్టు 17: దేశవ్యాప్తంగా ఎంపీలు, ఎమ్మెల్యేలపై 4,192 క్రిమినల్ కేసులు పెండింగ్‌లో ఉన్నట్లు అమికస్ క్యూరీ సుప్రీంకోర్టుకు వెల్లడించారు. పదేళ్లకు పైగా 519 కేసులు పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. 5 నుంచి10 ఏళ్ల మధ్య 754 కేసులు పెండింగ్‌లో ఉన్నాయని వెల్లడించారు. ఎంపీలు, ఎమ్మెల్యేలపై ఉన్న క్రిమినల్ కేసుల సత్వర విచారణపై అమికస్ క్యూరీ తాజాగా సుప్రీంకోర్టుకు 22వ నివేదికను సమర్పించారు. అమికస్ క్యూరీ సమర్పించిన నివేదికలోని వివరాల మేరకు..సిట్టింగ్ ఎంపీలపై 335 కేసులు పెండింగ్‌లో ఉండగా.. సిట్టింగ్ ఎమ్మెల్యేలపై 1,222 కేసులు పెండింగ్‌లో ఉన్నాయి. మాజీ ఎంపీలపై 269 కేసులు.. మాజీ ఎమ్మెల్యేలపై 1,339 కేసులు పెండింగ్‌లో ఉన్నాయి.మరో700 కేసుల దర్యాప్తు ఇంకా పూర్తికాలేదు. 360 కేసులు మూడేళ్లకు పైగా దర్యాప్తులో ఉన్నాయి. ఇక, లోక్‌సభలోని 543 మంది సభ్యుల్లో 251 మందిపై క్రిమినల్ కేసులు ఉన్నాయని అసోసియేషన్ ఫర్ డెమోక్రటిక్ రిఫార్మ్స్ (ఏడీఆర్) సంస్థ నివేదిక వెల్లడించింది. లోక్‌సభలోని 170 మంది సభ్యులపై తీవ్రమైన క్రిమినల్ కేసులు ఉన్నాయని ఆ నివేదిక తెలిపింది.



కూటమిలో ఏం జరుగుతోంది

విజయవాడ, ఆగస్టు17,తెలుగు రాష్ట్రాల్లో కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత , పవన్ కళ్యాణ్ ఉప ముఖ్యమంత్రి బాధ్యత చేపట్టడం ఆయన అభిమానులకు గర్వ కారణం. అయితే పవన్ కళ్యాణ్ కేవలం ఆ పదవి ని అలంకరణ కోసం వాడుకోకుండా, తానూ బాధ్యత చేపట్టిన శాఖలకు నూటికి నూరు శాతం న్యాయం చేస్తున్నాడు. వైసీపీ పార్టీ ప్రభుత్వ హయాం లో 24 వ స్థానం లో ఉన్న ఈ శాఖ, ఇప్పుడు మొదటి స్థానానికి చేరుకుందంటే పవన్ కళ్యాణ్ పని తీరు ఏ రేంజ్ లో ఉందో అర్థం చేసుకోవచ్చు. గ్రామా సభలు ఏర్పాటు చేసి, గ్రామాల్లోని ప్రజలు చేత వాళ్లకు అవసరమయ్యే పనులన్నీ కలెక్టర్ల దృష్టికి చేర్చి, పల్లె పండుగ పేరుతో రెండు విడతల్లో పవన్ కళ్యాణ్ ఈ స్థాయి ఫలితాలను అందుకున్నాడు.అభిమానులు ఎంతసేపు సినిమా ఫ్యాన్ వార్స్ లో దూరి రికార్డ్స్ కోసం కొట్లాడుకోవడం కాకుండా, ఇలాంటి విషయాలను జనాల్లోకి తీసుకెళ్తే నాయకుడిగా పవన్ కళ్యాణ్ ఇమేజ్ ఎక్కడికో వెళ్తుంది అంటూ సోషల్ మీడియా లో రాజకీయ విశ్లేషకులు కామెంట్స్ చేస్తున్నారు. పూర్తి వివరాల్లోకి వెళ్తే కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యం లో ప్రతీ ఏడాది దీనదయాళ్ ఉపాధ్యాయ పంచాయత్ సేతత్ వికాస్ జాతీయ సంస్థ గ్రామీణాభివృద్ధి, నీటి సంరక్షణ , పారిశుద్యం విభాగాల్లో పురస్కారాలను అందిస్తూ ఉంటుంది. కూటమి ప్రభుత్వం అధికారం లోకి వచ్చిన మొదటి సంవత్సరంలోనే పంచాయితీ రాజ్ శాఖ లో అవార్డులు అందుకుంది. ఇప్పుడు వరుసగా రెండవసారి కూడా అవార్డులను అందుకోవడం విశేషం. ఈ సంవత్సరం అయితే పంచాయితీ రాజ్ శాఖ ఏకంగా 5 విభాగాల్లో అత్యుత్తమ ర్యాంక్ అందుకుంది. గుడ్ గవర్నెన్స్ విభాగం లో శృంగవరం పంచాయత్ మొదటి స్థానం లో నిలబడింది.అదే విధంగా వుమెన్ ఫ్రెండ్లీ పంచాయత్ గా బొక్కాసం పాలెం అనే గ్రామం కూడా మొదటి స్థానం లో నిల్చింది. పేదరికం లేని గ్రామంగా, అత్యంత ప్రమాణాలతో జీవనం సాగుతున్న గ్రామం గా చెమ్ములపల్లి పంచాయత్ 2 వ స్థానం లో కొనసాగుతుండగా, సెల్ఫ్ సఫీషియంట్‌నెస్ స్ట్రక్చర్ విభాగం లో గుండుమల పంచాయత్ 3వ ర్యాంక్ లో కొనసాగుతుంది. ఇక ఉత్తమ మండలం విభాగం లో అయితే కుప్పం దేశం లోనే 3 వ ర్యాంక్ సాధించింది. ఇలా పవన్ కళ్యాణ్ ఆధ్వర్యం లో పంచాయితీ రాజ్ శాఖ ఎప్పుడూ చూడనంత అభివృద్ధిని చూస్తూ దేశంలోనే మన ఆంధ్ర ప్రదేశ్ ని ఆదర్శవంతమైన రాష్ట్రము గా తీర్చి దిద్దాడు పవన్ కళ్యాణ్.

తిరుమలలో గదుల దళారీ ముఠా గుట్టురట్టు

భక్తులను మోసగించే దళారుల పై చట్టపరమైన కఠిన చర్యలు
నకిలీ ఆధార్ కార్డులతో ఒకరు పట్టివేత, పోలీసు కేసు నమోదు

తిరుమల, 2026 ఆగస్టు 17,తిరుమలలోని సీఆర్వో కార్యాలయం వద్ద నకిలీ గుర్తింపు పత్రాలతో వేరొకరి పేర్లతో గదులు పొంది వాటిని అధిక ధరలకు భక్తులకు విక్రయిస్తున్న దళారీ ముఠా ప్రయత్నాన్ని టీటీడీ విజిలెన్స్ విభాగం భగ్నం చేసింది.ఆగస్టు 16న అప్పటికే ఒక గది పొందిన వ్యక్తి మరో గుర్తింపుతో తిరిగి గది కోసం క్యూలో నిలబడటాన్ని సీఆర్వో కార్యాలయం సిబ్బంది గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. విచారణలో అతడిని కేరళ మలప్పురం జిల్లాకు చెందిన ఆషిక్ అలీ పి.ఎం. (32)గా గుర్తించారు. అతని వద్ద రెండు నకిలీ ఆధార్ కార్డులు, గది రిజిస్ట్రేషన్ స్లిప్, రూ.800 నగదు, సెల్‌ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నారు.రంజిత్ అనే దళారి ఒక్కో గదికి రూ.1,000 చొప్పున ఇస్తామని తనను నియమించుకున్నట్లు ఆషిక్ విచారణలో వెల్లడించాడు. నకిలీ గుర్తింపు పత్రాలతో గదులు పొందడం, వాటిని దళారికి అప్పగించడం తన పని అని, ఆ గదులను భక్తులకు అధిక ధరలకు విక్రయిస్తున్నారని తెలిపాడు. ముఠాలోని ఇతర సభ్యులపై విచారణ కొనసాగుతోంది.విజిలెన్స్ విభాగం ఫిర్యాదు మేరకు తిరుమల-2 టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఈ ఘటనపై నమోదు చేయడం జరిగింది. నకిలీ ఆధార్ కార్డుల ప్రామాణికతను నిర్ధారించడంతో పాటు, సాంకేతిక ఆధారంగా ముఠా వ్యవహారాలపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.తిరుమలలో వసతి భక్తుల కోసం మాత్రమేనని, దళారుల ద్వారా గదులు కొనుగోలు చేయకూడదని, ఆధార్, ఫొటోలు, ఫోన్ నంబర్లు వంటి వ్యక్తిగత వివరాలను అపరిచితులకు ఇవ్వకూడదని, అదేవిధంగా వసతిని సీఆర్వో కౌంటర్లు, టీటీడీ అధికారిక వెబ్‌సైట్, అధికారిక మొబైల్ యాప్ ద్వారా మాత్రమే పొందాలని భక్తులకు విజ్ఞప్తి చేయడమైనది.ఎవరైనా దళారి డబ్బు తీసుకుని గది ఇప్పిస్తానని సంప్రదించినా లేదా అనుమానాస్పద కదలికలు కనిపించినా వెంటనే టీటీడీ విజిలెన్స్ ఉ సెక్యూరిటీ కంట్రోల్ రూమ్ నెం: 9866898630 లేదా టీటీడీ కాల్ సెంటర్ నెం : 155257 కు సమాచారం ఇవ్వాలని భక్తులను కోరడమైనది.భక్తులను మోసగించే దళారులు, వారికి సహకరించే వారిపై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుంది.

పోలీసుల కారులో గంజాయి

అంతా అబద్దం
దర్శి డిఎస్పి

ఒంగోలు,దర్శి నియోజకవర్గ పరిధిలో పోలీసు వాహనంలో గంజాయి లభ్యమైందన్న వార్తలపై దర్శి డిఎస్పి బాలమురళీకృష్ణ స్పందించారు. అంతా అబద్దమని అన్నారు.సంతనూతలపాడు మరియు మల్లవరం ఎస్ఐలు సాయంత్రం వేళ ప్రయాణిస్తుండగా, ధర్మవరం దాటిన తర్వాత రోడ్డు పక్కన ఒక వ్యక్తి టూ వీలర్తో అనుమానాస్పదంగా కనిపించాడు. పోలీసులను చూసి ఆ వ్యక్తి తన వద్ద ఉన్న ఒక మూటను రోడ్డుపైనే వదిలేసి ద్విచక్రవాహనంపై పరారయ్యాడు. పోలీసులు కారు దిగి చూడగా ఆ మూటలో సుమారు 2 కేజీల గంజాయి, ఒక మందు బాటిల్ ఉన్నాయి. గంజాయితో పారిపోతున్న వ్యక్తిని వెంటాడే క్రమంలో పోలీసులు తమ కారు వేగం పెంచారు. ఈ క్రమంలో ఎదురుగా వచ్చిన ఒక బైక్ను తప్పించబోయి, కారు ఒక ఆటోను బలంగా ఢీకొట్టింది. ఆటోలో ఉన్న నలుగురికి స్వల్ప గాయాలయ్యాయి. ప్రమాదం జరిగిన వెంటనే ఎస్ఐలు క్షతగాత్రుల ప్రాణరక్షణకు ప్రాధాన్యతనిచ్చారు. 108 అంబులెన్స్ను సమాచారం అందించి, ప్రైవేటు వాహనంలో గాయపడిన వారిని ఆసుపత్రికి తరలించారు. తీవ్ర గాయాలైన ఒక మహిళను మెరుగైన వైద్యం కోసం ఒంగోలు రిఫర్ చేశారు. “ఈ ఘటనలో పోలీసులకు గంజాయి విక్రయాలతో ఎలాంటి సంబంధం లేదు. నేరస్థుడిని పట్టుకునే క్రమంలోనే వేగంగా వెళ్లడం వల్ల దురదృష్టవశాత్తు ఆటోను ఢీకొనడం జరిగింది. పారిపోయిన వ్యక్తిపై కేసు నమోదు చేసి సమగ్ర విచారణ జరుపుతామని వెల్లడించారు.

బద్వేలు రూరల్ నియోజకవర్గంగా పోరుమామిళ్ల

వచ్చే ఎన్నికల నాటికి బద్వేలు అసెంబ్లీ జనరల్ కానుందా ?
గత 25 సంవత్సరాలుగా ఎస్సీ రిజర్వ్ ఉన్న బద్వేలు
పార్లమెంట్ కేంద్రంగా ప్రొద్దుటూరు

బద్వేలు ,ఇప్పటివరకు ఏడు మండలాలతో కలిసి ఉన్న బద్వేలు నియోజవర్గం పునర్ విభజన తో ప్రత్యేకంగా బద్వేలు రూరల్ పేరుతో పోరుమామిళ్ల కేంద్రంగా మరో నియోజకవర్గం ఏర్పాటు అయ్యే అవకాశాలు ఎక్కువగా కనిపిస్తున్నాయి. బద్వేల్ నియోజకవర్గం లో బద్వేలు పోరుమామిళ్ల కలసపాడు అట్లూరు బి కోడూరు కాశినాయన గోపవరం మండలాలు ఉన్నాయి. ఇప్పుడు పోరుమామిళ్ల కేంద్రంగా బద్వేల్ ఏర్పాటు కానున్నట్లు సమాచారం. రాజకీయ విశ్లేషకులు కూడా ఇదే అభిప్రాయాన్ని వ్యక్తం చేస్తున్నారు. ఉమ్మడి కడప జిల్లాలో ప్రస్తుతం 10 అసెంబ్లీ నియోజకవర్గాలు కడప రాజంపేట పార్లమెంట్ నియోజకవర్గాలు ఉన్నాయి. ఇప్పుడు అసెంబ్లీ స్థానాల సంఖ్య 15 కు పెరగవచ్చని రాజకీయ పరిశీలకులు భావిస్తున్నారు. అందులో పోరుమామిళ్ల ఎర్రగుంట్ల లక్కిరెడ్డిపల్లె కడప గ్రామీణ నియోజకవర్గంతో పాటు మరో నియోజకవర్గం ఏర్పాటు అయ్యే అవకాశం ఉంది. బద్వేలు రూరల్ నియోజకవర్గ పోరుమామిళ్ల కేంద్రంగా ఏర్పాటు అయ్యే పోరుమామిళ్ల మండలం బి కోడూరు కాశి నాయన కలసపాడు మండలాలతోపాటు మైదుకూరు నియోజకవర్గంలోని బ్రహ్మంగారి మఠం మండలం కూడా కలిసే అవకాశం ఉంది. ఇక బద్వేలు నియోజకవర్గం లో బద్వేలు గోపవరం అట్లూరు మండలాలు ఉండనున్నాయి. నియోజకవర్గ విభజనపై ఆశావాహులు ఎన్నో ఆశలు పెట్టుకున్నారు. గత 25 సంవత్సరాలుగా బద్వేల్ అసెంబ్లీ రిజర్వు స్థానంగా ఉంది విభజన జరిగితే బద్వేల్ అసెంబ్లీ జనరల్ అవుతుందని రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు పార్లమెంట్ కేంద్రంగా ప్రొద్దుటూరు పార్లమెంటు అసెంబ్లీ స్థానాలు పెంచాలని కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో కడప జిల్లాలోని రాజకీయ ఉత్సాహవంతుల్లో ఎక్కడలేని విధంగా పరుగులు పెట్టిస్తుంది. ప్రస్తుతం కడప జిల్లాలో పులివెందుల జమ్మలమడుగు బద్వేలు కడప ప్రొద్దుటూరు మైదుకూరు కమలాపురం ఉన్నాయి. తాజా నిర్ణయం ప్రకారం రాష్ట్రంలో అసెంబ్లీ సీట్లు పెంపు దమాషా ప్రకారం చూస్తే రెండు నుంచి మూడు అసెంబ్లీ స్థానాలు పెరిగే అవకాశం ఉంది తాజా నిర్ణయం ప్రకారం ఎర్రగుంట్ల కడప గ్రామీణ పోరుమామిళ్ల కొత్త నియోజకవర్గాలు రానున్నాయి. 1.50 లక్షలు ఓట్లు ఉండేలా కొత్త నియోజకవర్గాలు ఏర్పాటు చేయాలని ప్రతిపాదన ఉంది. దీంతో కడప కడప గ్రామీణ నియోజకవర్గాలు ఏర్పాటు అవకాశాలు ఉన్నాయి. అవసరమైతే సిద్ధవటం మండలాన్ని కడప గ్రామీణ నియోజకవర్గంలో కలిపే అవకాశం ఉంది. ప్రతిపాదిత, ఎర్రగుంట్ల నియోజకవర్గం కింద ఎర్రగుంట్ల ముదునూరు వీరపు నాయుడు పల్లె తొండూరు కొండాపురం సింహాద్రిపురం మండలాలను చేర్చే అవకాశం ఉంది. మూడోది ఏర్పాటు చేస్తే బద్వేలు మైదుకూరు పొద్దుటూరు నుంచి అవకాశం ఉంది పోరుమామిళ్ల పొద్దుటూరు గ్రామీణ నియోజకవర్గాలు ఏర్పాటు అయ్యే అవకాశాలు లేకపోలేదు. రాష్ట్రంలో పెరిగే పార్లమెంట్ స్థానాలను పరిగణలోకి తీసుకుంటే కడప జిల్లా నుంచి ఒక నియోజకవర్గానికి అవకాశం ఉంది. పట్టణ ప్రాథమిక జనాభా ఓట్ల సంఖ్యను బట్టి ప్రొద్దుటూరు పార్లమెంటు అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. ఇప్పటికే జిల్లాలో కడప కింద కడప రాజంపేట ప్రతిపాదిత కడప గ్రామీణ కమలాపురం బద్వేలు నియోజకవర్గాలు వచ్చే వీలు ఉంది. ప్రొద్దుటూరు పార్లమెంట్ పరిధిలోకి పులివెందుల ప్రతిపాదిత ఎర్రగుంట్ల మైదుకూరు జమ్మలమడుగు పొద్దుటూరు అసెంబ్లీ నియోజకవర్గాలు వచ్చే అవకాశం ఉంది. విభజన జరిగితే పెరిగే స్థానాల్లో తమ అదృష్టం ఎలా ఉందో చూసుకోవచ్చు అనిప్రధాన పార్టీలకు చెందిన వారు ఎంతో ఆశపడుతున్నారు.

తుంగభద్ర నది ఎండిపోవడంపై కూటమి ప్రభుత్వం తీరును ఎండగట్టిన

వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఎమ్మిగనూరు ఇంచార్జ్ రాజీవ్ రెడ్డి
తుంగభద్ర జలాల కోసం రైతుల ఆవేదన

నందవరం,మండల పరిధిలోని గురజాల గ్రామంలో తుంగభద్ర నదిలో నీరు పూర్తిగా ఎండిపోయి, తాగు,సాగునీరు అందక రైతులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నప్పటికీ రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం పట్టించుకోకపోవడంపై వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఎమ్మిగనూరు ఇంచార్జ్ ఎర్రకోట రాజీవ్ రెడ్డి తీవ్రస్థాయిలో మండిపడ్డారు.నదిలో కనీసం ప్రవహించే నీరు కూడా కనిపించకుండా పోయిందని పాడి పశువులకు సైతం నది తీరంలో తాగునీరు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నాయని గ్రామస్తులు, రాజీవ్ రెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు తుంగభద్ర పరివాహక ప్రాంతాల్లో నీటి మట్టాలు పూర్తిగా పడిపోయి కనీసం ప్రవాహపు జాడ కూడా లేకపోయినా ప్రభుత్వానికి చీమ కుట్టినట్లు కూడా లేదని రాజీవ్ రెడ్డి విమర్శించారు.తుంగభద్ర నది తీర ప్రాంత రైతులు తమ ప్రధాన సమస్యను రాజీవ్ రెడ్డి గారి దృష్టికి తీసుకువచ్చారు. తుంగభద్ర నది నుంచి నీరు వస్తుందనే నమ్మకంతో పంటలు సాగు చేశామని, వరి నాట్లు పూర్తయిన తర్వాత నీరు అందక పొలాలు బీటలు వారుతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు.తుంగభద్ర జలాశయంలో నీరు ఉన్నప్పటికీ దిగువ ప్రాంతమైన రాయలసీమకు,నది తీర ప్రాంతాలకు సాగునీరు విడుదల చేయకపోవడంతో పంటలు ఎండిపోతున్నాయని రైతులు వాపోయారు.తమ కష్టాలు ఎవరికి చెప్పుకోవాలో అర్థం కావడం లేదని, ప్రభుత్వం వెంటనే స్పందించి తుంగభద్ర జలాలను రాయలసీమ రైతులకు అందించాలని కోరారు. సాగునీరు అందక ఆయకట్టు రైతుల పంటలు ఎండిపోతున్నాయని, రైతన్నలు తీవ్ర నష్టాలను చవిచూస్తున్నా కూటమి ప్రభుత్వానికి ఏమాత్రం చిత్తశుద్ధి లేదని మండిపడ్డారు.ఇసుక రీచ్‌ల పేరుతో దోపిడీ నదిలో చుక్క నీరు లేక ప్రజలు తాగునీటి కోసం అల్లాడుతుంటే, మరోవైపు ఇసుక రీచ్‌ల పేరుతో నదిని మరింతగా దోచుకుంటున్నారని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు

చేనులకు హంద్రీనీవా నీళ్లే నిలిపివేత

తీవ్ర ఆగ్రహంలో రైతన్నలు
!?అధికారుల తీరుపై మండిపడుతున్న అన్నదాతలు
పంటలు ఎండిపోతున్నాయని ఆవేదన

పత్తికొండ , పత్తికొండ మండలం హోసూరు గ్రామం లో పంట పొలాలకు జీవనాధారమైన హంద్రీనీవా కాలువల నుంచి చేనులకు నీటిని కట్టకుండా అధికారులు ఆంక్షలు విధించడంపై రైతులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. తమ పొలాలకు నీరు పారించుకోవడానికి వెళ్తుంటే అధికారులు అడ్డుకుంటున్నారని, దీనివల్ల కంటికి రెప్పలా కాపాడుకుంటున్న పంటలు ఎండిపోయే ప్రమాదం ఏర్పడిందని అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ?పంటలు ఎండిపోతున్నా పట్టవా??రాత్రింబవళ్లు కష్టపడి వేల రూపాయలు పెట్టుబడి పెట్టి పంటలు సాగు చేశామని, ఇప్పుడు కీలక సమయంలో నీళ్లు ఇవ్వకపోతే తాము తీవ్రంగా నష్టపోతామని రైతులు వాపోతున్నారు. తమ కళ్లముందే చేన్లు ఎండిపోతుంటే అధికారులు మాత్రం ఏమాత్రం కనికరం లేకుండా ప్రవర్తిస్తున్నారని ఆరోపిస్తున్నారు. ?అధికారుల వైఖరిపై విమర్శలు ?నీటి వినియోగంపై అధికారులు కఠిన ఆంక్షలు విధించడం, కాలువల వద్ద కాపలా ఉండి నీటిని మళ్లించకుండా అడ్డుకోవడంపై స్థానిక హోసూర్ రైతు, బనగాని శ్రీనివాసులు, మండిపడుతున్నాయి. ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు స్పందించి వెంటనే రైతుల ఇబ్బందులను పరిష్కరించాలని డిమాండ్ చేస్తున్నారు. ?”సాగునీరు అందక పంట ఎండిపోతే మేము అప్పుల పాలవుతాం. అధికారులు వెంటనే స్పందించి చేనులకు నీటిని విడుదల చేయకపోతే పెద్ద ఎత్తున ఆందోళన బాట పడతాం.”బాధిత రైతులు ?రైతుల ప్రధాన డిమాండ్లు: ?హంద్రీనీవా కాలువల నుంచి పంట పొలాలకు నీటిని తక్షణమే విడుదల చేయాలి.?చేనులకు నీళ్లు కట్టకుండా అడ్డుకుంటున్న అధికారుల తీరుపై ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలి.?చివరి ఆయకట్టు వరకు నీరు అందేలా ప్రణాళికాబద్ధంగా చర్యలు చేపట్టాలి. ?వెంటనే అధికారులు స్పందించి తమ పంటలను కాపాడాలని, హోసూర్ గ్రామ రైతులు తదితరులు కోరుతున్నారు

గిరిజన పీహెచ్‌సీని సందర్శించిన ఐటీడీఏ ప్రోగ్రాం అధికారి

కొత్తపల్లి, : ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి పి.వి.ఎస్. నాయుడు ఆదేశాల మేరకు ఐటీడీఏ ప్రోగ్రాం అధికారి బి. పరమేశ్వర్ కొత్తపల్లి, గోకవరం గిరిజన పీహెచ్‌సీతో పాటు యెర్రమటం చెంచు గూడెం, అంగన్‌వాడీ కేంద్రాలను సందర్శించి వైద్య సేవలను సమీక్షించారు.ఈ సందర్భంగా పీహెచ్‌సీ పనితీరు, ఓపీ సేవలు, తల్లి?బిడ్డ ఆరోగ్యం, గర్భిణీలకు అందుతున్న సేవలు, టీకాలు, జ్వరాలు, అంటువ్యాధులు, ప్రయోగశాల పరీక్షలు, రక్తపోటు, మధుమేహం, మందుల లభ్యత తదితర అంశాలకు సంబంధించిన రికార్డులు, నివేదికలను పరిశీలించారు.చెంచు గూడేల్లో ఉచిత వైద్య శిబిరాలుకొత్తపల్లి, శివపురం, యెర్రమటం చెంచు గూడేల్లో ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించారు. యెర్రమటం చెంచు గూడెంలో జరిగిన వైద్య శిబిరానికి 55 మంది, కొత్తపల్లి గూడెంలో 60 మంది హాజరయ్యారు. గర్భిణీలు, బాలింతలు, చిన్నారులు, రక్తపోటు, మధుమేహం, జ్వరంతో బాధపడుతున్న వారికి వైద్య పరీక్షలు నిర్వహించారు.అవసరమైన వారికి పూర్తి రక్త పరీక్షలు, మలేరియా, టైఫాయిడ్ పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. కాలానుగుణ వ్యాధుల నివారణ, పరిశుభ్రత, పోషకాహారం, సకాలంలో వైద్య సేవలు పొందడంపై ప్రజలకు అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో వైద్యాధికారులు డాక్టర్ ద్వీపా నాగవేణి, గులాబ్జా, డాక్టర్ హకీమ్ రషీద్, డాక్టర్ సుష్మా సాయి, ప్రజారోగ్య విస్తరణ వైద్యాధికారి రాఘవేంద్ర, ల్యాబ్ టెక్నీషియన్ శివ, ఏఎన్ఎంలు నిర్మల జయమణి, శాంతమ్మ, ఆశా కార్యకర్తలు, మెయిల్ హెల్త్ అసిస్టెంట్ శ్రీరామ్ నాయక్ పాల్గొన్నారు.డాక్టర్ హకీమ్ రషీద్ మాట్లాడుతూ యెర్రమటం, జనాల గూడెం ప్రాంతాల్లోని గర్భిణీలను క్రమం తప్పకుండా పర్యవేక్షిస్తూ అవసరమైన పరీక్షలు, చికిత్స, తదుపరి వైద్య సేవలు అందిస్తున్నట్లు తెలిపారు.ఐటీడీఏ ప్రోగ్రాం అధికారి శ్రీ బి. పరమేశ్వర్ వైద్య సిబ్బంది సేవలను అభినందించారు. గిరిజన పీహెచ్‌సీలో ప్రైవేట్ ఆసుపత్రులకు సమానంగా నాణ్యమైన వైద్య సేవలు అందుతున్నాయని పేర్కొన్నారు. రికార్డుల నిర్వహణ, నిరంతర పర్యవేక్షణ, తదుపరి చికిత్సపై ప్రత్యేక దృష్టి పెట్టాలని వైద్య సిబ్బందికి సూచించారు.

ప్రజా సమస్యలు తెలుసుకున్న ఎర్రకోట రాజీవ్ రెడ్డి

నందవరం,మండలం, గురజాల గ్రామం నమస్తే ఎమ్మిగనూరు ? ప్రజా సమస్యలపై పోరుబాట కార్యక్రమంలో భాగంగా నందవరం మండలం గురజాల గ్రామంలో 11వ రోజు కార్యక్రమానికి ఎమ్మిగనూరు నియోజకవర్గ సమన్వయకర్త ఎర్రకోట రాజీవ్ రెడ్డి శ్రీకారం చుట్టారు. గ్రామానికి చేరుకున్న రాజీవ్ రెడ్డి గ్రామ నాయకులు నరసింహారెడ్డి, గ్రామ అధ్యక్షుడు ఈశ్వర్ రెడ్డి, మాజీ సర్పంచ్ వీరస్వామి, కురువ నరసింహులు, జాను తదితరుల ఆధ్వర్యంలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. శాలువాతో సన్మానించి, పూలమాలతో ఘనంగా సత్కరించారు.అనంతరం శ్రీ రామలింగేశ్వర స్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి,గ్రామ ప్రజలు, రైతులు, నియోజకవర్గ ప్రజలు సుఖశాంతులతో ఉండాలని స్వామివారిని ప్రార్థించారు. అనంతరం రామలింగేశ్వర స్వామిని దర్శించుకున్నారు. వైఎస్ఆర్సీపీ నాయకులు, కార్యకర్తలతో కలిసి గ్రామంలోని ప్రతి ఇంటిని సందర్శిస్తూ కూటమి ప్రభుత్వం ప్రకటించిన ‘సూపర్ సిక్స్’ హామీలు అమలయ్యాయా? ప్రజలకు ఏమైనా సమస్యలు ఉన్నాయా? అని రాజీవ్ రెడ్డి ప్రజలను అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా బీసీ సోదరులు తమ సమస్యలను రాజీవ్ రెడ్డి గారి దృష్టికి తీసుకువచ్చారు. బీసీలకు 50 ఏళ్లకే పెన్షన్ ఇస్తామని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ఇప్పటివరకు ఒక్క పెన్షన్ కూడా ఇవ్వలేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో చాంద్ భాషా గురజాల గ్రామస్తులు రాజారెడ్డి, పెద్ద నరసింహులు, హనుమంతు యువసేన సభ్యులు ఎం వీరేష్ మహేష్ నాగేంద్ర,రాముడు, రామకేసు, సురేష్, ని.బీముడు, బీముడు,శంకరన్న, టీ. రాముడు, కురువ రాముడు, నతదితరులు..నందవరం గ్రామపంచాయతీ నాయకులు చుక్క మల్లేష్, నిఖిల్ చక్రవర్తి, లింగమూర్తి, బసవరాజు గౌడ్, లక్ష్మన్న, వెంకటేష్, వేణు; గంగవరం నుండి శివన్న, రాముడు మోహన్ రెడ్డి, దానం నందవరం మండల నాయకులు, కార్యకర్తలు, యువకులు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ అన్నమయ్య జిల్లా కార్యదర్శిగా నిర్మల్ కుమార్

రాయచోటి, భారతీయ జనతా పార్టీ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షులు మాధవ్ అన్నమయ్య జిల్లా బీజేపీ అధ్యక్షులు పులి నరేంద్ర కుమార్ రెడ్డి ఆదేశాల మేరకు నూతన జిల్లా కమిటీని సోమవారం ప్రకటించారు. ఈ సందర్భంగా నిర్మల్ కుమార్ బీజేపీ అన్నమయ్య జిల్లా కార్యదర్శిగా నియమించారు.జిల్లా కార్యదర్శిగా తనను నియమించినందుకు రాష్ట్ర పార్టీ నాయకత్వానికి, అన్నమయ్య జిల్లా పార్టీ నాయకత్వానికి నిర్మల్ కుమార్ హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. తనకు ఈ బాధ్యత లభించేందుకు సహకరించిన పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు మరియు ప్రతి ఒక్కరికీ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.పార్టీ తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ, బీజేపీ సిద్ధాంతాలు, ప్రజా సమస్యల పరిష్కారం, పార్టీ బలోపేతం కోసం శక్తివంచన లేకుండా పనిచేస్తానని నిర్మల్ కుమార్ తెలిపారు

వైజాగ్ ఎయిర్ పోర్ట్ చాలా మంది కోరుకుంటున్నారు

విశాఖపట్టణం, ఆగస్టు 17విశాఖపట్నం ఎయిర్‌పోర్టులో విమాన కార్యకలాపాలు నిలిపివేయడంతో ఎందరో బాధపడుతున్నారని, అయితే కొన్ని మంచి పనులు జరిగినప్పుడు కొంతమేర బాధ ఉండటం సహజమేనని కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు వ్యాఖ్యానించారు. ఈరోజు నుంచి భోగాపురం గ్రీన్‌ఫీల్డ్ అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి కమర్షియల్ ఆపరేషన్స్ అధికారికంగా ప్రారంభమైనట్లు వెల్లడించారు.భోగాపురం ఎయిర్‌పోర్టుకు వచ్చిన ప్రయాణికులు ఎంతో ఉత్సాహంగా ఉన్నారని తెలిపారు. జీఎంఆర్ సంస్థ ప్రాణం పెట్టి నిర్మించిన ఈ విమానాశ్రయ నిర్మాణం మన ప్రాంత చరిత్ర, సంస్కృతికి అద్దం పడుతోందని ప్రశంసించారు. విశాఖపట్నం ఎయిర్‌పోర్టును భవిష్యత్తులో ఏ విధంగా సమర్థవంతంగా వినియోగించుకోవాలనే దానిపై స్పష్టమైన ప్రణాళికలు రూపొందిస్తామని హామీ ఇచ్చారు. వైజాగ్ నుంచి కనెక్టివిటీ కోసం రోడ్ల అభివృద్ధి పనులు సాగుతున్నాయని, బీచ్ కారిడార్ పనులను కూడా త్వరలోనే ప్రారంభిస్తామని స్పష్టం చేశారు.ఒకప్పుడు ఉత్తరాంధ్రను వెనుకబడిన ప్రాంతంగా పిలిచేవారని, కానీ తమ ప్రభుత్వ హయాంలో విజయనగరం సర్వాంగ సుందరంగా అభివృద్ధి చెందుతోందని రామ్మోహన్ నాయుడు తెలిపారు. విజయనగరం జిల్లాలో నిర్మించిన ఈ బృహత్తర విమానాశ్రయాన్ని చూస్తుంటే ప్రపంచమే మన దగ్గర ఉందనే అద్భుతమైన అనుభూతి కలుగుతోందని సంతోషం వ్యక్తం చేశారు. భోగాపురం ఎయిర్‌పోర్ట్ అందుబాటులోకి రావడంతో ఉత్తరాంధ్ర ప్రగతి పథంలో ఒక నూతన శకం, సరికొత్త అధ్యాయం ప్రారంభమైందని స్పష్టం చేశారు.

స్పోర్ట్స్ గన్

గంగూలీ కెప్టెన్సీకే ఎసరు పెట్టిన భారత ప్లేయర్లు.. అసలేం జరిగిందంటే?



భారత మాజీ కెప్టెన్ సౌరభ్ గంగూలీకి అప్పట్లో జట్టులోని ప్లేయర్లు చుక్కలు చూపించారట! పాకిస్థాన్‌తో కీలక వన్డే సిరీస్‌కు ముందు డ్రెస్సింగ్ రూమ్‌లో దాదాపై చేసిన ఓ ప్రాంక్‌ను టీమిండియా మాజీ ప్లేయర్ హర్భజన్ సింగ్ తాజాగా గుర్తు చేసుకున్నాడు. ఏప్రిల్ ఫూల్స్ డే సందర్భంగా గంగూలీని ప్రాంక్ చేయాలని యువరాజ్ సింగ్‌తో కలిసి ప్లాన్ చేసినట్లు వెల్లడించాడు. దాదాని ఏకంగా కెప్టెన్సీ నుంచి తప్పుకునేలా భయపెట్టామని చెప్పాడు. పాక్ సిరీస్‌కు ముందు జరిగిన ఈ విషయాన్ని భజ్జీ ఓ ఇంటర్వ్యూలో వివరించాడు.'ఆ రోజు జట్టు మొత్తం డ్రెస్సింగ్ రూమ్‌లోనే ఉంది. ఏప్రిల్ ఫూల్స్ డే సందర్భంగా దాదాను ప్రాంక్ చేద్దామని యువరాజ్ ప్లాన్ వేశాడు. యువీ దాదా దగ్గరకు వెళ్లి ప్లాన్ అమలు చేశాడు.. 'మీరు చేసిందేం బాలేదు. నన్ను పార్టీ యానిమల్ అన్నారు. హర్భజన్ గురించి కూడా తప్పుగా మాట్లాడారు. ఆశిష్ నెహ్రా, జహీర్ ఖాన్ కూడా మ్యాచ్‌లు ఆడటం కంటే ఎక్కువగా పార్టీలు చేసుకుంటారని మీడియా ముందు చెప్పారు. ఇలా చేయడం పద్ధతేనా?' అని యువీ దాదాను ప్రశ్నించాడు. దీంతో గంగూలీ ఒక్కసారిగా అవాక్కయ్యాడు. 'నేనెప్పుడు అలా అన్నాను?' అంటూ తిరిగి ప్రశ్నించాడు. మేం ముందే సిద్ధం చేసుకున్న తప్పుడు వార్తా క్లిప్పింగ్ అతడికి చూపించాం. దీంతో నిజంగానే అలా మాట్లాడానా? అని గంగూలీ ఆందోళన పడటం మొదలుపెట్టాడు' అంటూ భజ్జీ వివరించాడు.ప్రాంక్‌ను మరింత రక్తి కట్టించేందుకు సీనియర్ ప్లేయర్లు సచిన్ టెండూల్కర్, రాహుల్ ద్రవిడ్‌లను కూడా రంగంలో దించినట్లు భజ్జీ వెల్లడించాడు. 'ఈ విషయమంతా సచిన్ పాజీకి నేను ముందే చెప్పాను. మీరు కూడా ఈ ప్లాన్‌లో ఉంటే బాగుంటుందని ఒప్పించా. సచిన్, రాహుల్ కూడా దాదాకు ఎలాంటి అనుమానం రాకుండా నటించారు. 'మీడియా ముందు నువ్వు ఇలా మాట్లాడటం అస్సలు పద్ధతి కాదు దాదా' అని సచిన్ పాజీ, 'దాదా.. ఇది తప్పు' అని రాహుల్ భాయ్ గంగూలీతో అన్నారు. ఇద్దరు సీనియర్ ప్లేయర్లు కూడా చెబుతుండటంతో గంగూలీ నిజంగానే తప్పు చేశానేమో అని భయపడ్డాడు. ఆ వ్యాఖ్యలు తానే చేశానని రుజువైతే కెప్టెన్సీనే వదులుకుంటానని తెలిపాడు' అని హర్భజన్ వెల్లడించాడు.ఇంతటితో ప్రాంక్ ఆగలేదు. హర్భజన్‌తో పాటు మరికొందరు ఆటగాళ్లు కోపంగా తమ కిట్లు తీసుకుని డ్రెస్సింగ్ రూమ్ నుంచి బయటకు వెళ్లడం మొదలుపెట్టారు. దీంతో గంగూలీ మరింత కంగారుపడ్డాడు. 'అయ్యో.. ఆగండి! రేపు మ్యాచ్ ఉంది. మీరేం చేస్తున్నారు?' అంటూ గంగూలీ వారి వెంట పరుగెత్తాడని హర్భజన్ నవ్వుతూ గుర్తుచేసుకున్నాడు. చివరికి ఎవరో నవ్వేయడంతో అసలు విషయం బయటపడింది. గంగూలీని తాము మరీ ఇబ్బంది పెట్టేశామని అప్పట్లో అందరూ భావించారట. 'మరో కెప్టెన్ అయితే నిజంగానే మా బ్యాగులు బయటకు విసిరేసి ఇంటికి వెళ్లిపోమని చెప్పేవాడు. కానీ దాదా మాకు అన్నయ్య లాంటివాడు' అని భజ్జీ చెప్పాడు.ఇలాంటి సరదా ప్రాంక్‌లు జట్టులో ఆటగాళ్ల మధ్య అనుబంధాన్ని పెంచుతాయని హర్భజన్ చెప్పాడు. ఎప్పుడూ క్రికెట్ గురించే మాట్లాడుకుంటూ ఉంటే డ్రెస్సింగ్ రూమ్ వాతావరణం గంభీరంగా మారిపోతుందని, సరదా పోతుందని అన్నాడు. 'హ్యాపీ డ్రెస్సింగ్ రూమ్ అంటే విన్నింగ్ డ్రెస్సింగ్ రూమ్. మైదానంలో ఏం జరిగినా అక్కడితో వదిలేయాలి. దానినే పట్టుకుని కూర్చుంటే లాభం ఉండదు. వాతావరణం భారంగా మారుతుంది' అని హర్భజన్ పేర్కొన్నాడు. ఆ సరదా వాతావరణం తర్వాతి మ్యాచ్‌లోనూ కనిపించిందని చెప్పొచ్చు. పాకిస్థాన్‌పై భారత్ 87 పరుగుల తేడాతో ఘన విజయం సాధించింది. వీరేంద్ర సెహ్వాగ్, రాహుల్ ద్రవిడ్ సెంచరీలు బాదగా.. సచిన్ టెండూల్కర్ ఐదు వికెట్లు పడగొట్టాడు. అయితే ఆరు మ్యాచ్‌ల వన్డే సిరీస్‌లో భారత్‌కు ఆశించిన ఫలితం దక్కలేదు. తొలి రెండు మ్యాచ్‌లు గెలిచినప్పటికీ ఆ తర్వాత పుంజుకోలేకపోయిన టీమిండియా.. చివరకు సిరీస్‌ను 2-4తో చేజార్చుకుంది.

ఐపీఎల్ ఆటగాళ్ల ట్రేడింగ్ పారదర్శకత ఉండాలి: సునీల్ గావస్కర్



ఐపీఎల్ ట్రేడింగ్ వ్యవస్థపై టీమిండియా మాజీ క్రికెటర్ సునీల్ గావస్కర్ సంచలన వ్యాఖ్యలు చేశారు. ఈ ట్రేడింగ్ వ్యవస్థలో పారదర్శకత కొరవడిందని ఆయన అభిప్రాయపడ్డారు. ఐపీఎల్‌లో ఫ్రాంచైజీల మధ్య జరిగే ఆటగాళ్ల బదిలీలు, వాటికి సంబంధించిన ఆర్థిక లావాదేవీల వివరాలను బహిర్గతం చేయాలని ఆయన బీసీసీఐని కోరారు. తన 'మిడ్-డే' కాలమ్‌లో గావస్కర్ ఈ అంశంపై బీసీసీఐకి స్పష్టమైన విజ్ఞప్తి చేశారు.ఐపీఎల్‌లో సాధారణంగా జరిగే వేలం పద్ధతికి భిన్నంగా ఆఫ్‌సీజన్‌లో ఫ్రాంచైజీలు నేరుగా ఆటగాళ్లను ట్రేడ్ చేసుకుంటుంటాయి. అయితే, ఈ ప్రక్రియలో ఆటగాడిని కొనుగోలు చేసిన ధర లేదా ఆర్థిక వివరాలు కేవలం సంబంధిత రెండు ఫ్రాంచైజీలు, ఆటగాడికి, అలానే బీసీసీఐకి మాత్రమే తెలుస్తున్నాయని గావస్కర్ గుర్తుచేశారు. దీనివల్ల మిగతా జట్లకు ఆ సమాచారం తెలియక, అవి నిర్దేశిత వేతన నిబంధనలను పాటిస్తున్నాయా లేదా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయని ఆయన పేర్కొన్నారు.'ఒక ఫ్రాంచైజీ నుంచి మరొకదానికి ఆటగాడి మార్పిడి బహిరంగంగానే జరుగుతున్నప్పటికీ, ట్రేడింగ్ జరిగేటప్పుడు వెచ్చించిన మొత్తం మాత్రం గోప్యంగా ఉంటోంది. ఈ నేపథ్యంలో ఇతర జట్లకు కూడా ఆ ట్రేడింగ్ తెలియాల్సిన అవసరం ఉంది. అప్పుడే ఆటగాళ్ల జీతాల పరిమితి నిబంధనలను అందరూ సరిగ్గా పాటిస్తున్నారనే స్పష్టత వస్తుంది. కాబట్టి బీసీసీఐ ఈ విషయంలో పూర్తి పారదర్శకత పాటించి, ట్రేడింగ్ మొత్తాలను ప్రేక్షకులకు, ఇతర ఫ్రాంచైజీలకు అందుబాటులో ఉంచాలి' అని గావస్కర్ స్పష్టం చేశారు.

అరంగేట్ర మ్యాచ్‌లోనే శ్రీలంక బౌలర్ చెత్త రికార్డు



గాలే వేదికగా శ్రీలంకతో జరుగుతోన్న తొలి టెస్టులో టీమిండియా 462 పరుగులకే ఆలౌటైంది. ఓవర్ నైట్ స్కోరుకు అదనంగా రెండు పరుగులను మాత్రమే జోడించింది. ఇక ఈ మ్యాచ్‌లో శ్రీలంక డెబ్యూ బౌలర్ కేశర నువాంత చెత్త రికార్డు మూటగట్టుకున్నాడు. అరంగేట్రం టెస్టులో అత్యధిక పరుగులు ఇచ్చిన నాలుగో బౌలర్‌గా కేశర నిలిచాడు. భారత తొలి ఇన్నింగ్స్‌లో 39 ఓవర్లు వేసిన నువాంత 3 వికెట్లు తీసి 175 పరుగులు సమర్పించుకున్నాడుఇక శ్రీలంక తరఫున టెస్టు ఫార్మట్ డెబ్యూ మ్యాచ్‌లో అత్యధిక పరుగులు సమర్పించుకున్న బౌలర్‌గా సూరజ్ రన్‌దివ్ అగ్రస్థానంలో ఉన్నాడు. 2010లో కొలంబో వేదికగా భారత్‌తో జరిగిన మ్యాచ్‌లో 73 ఓవర్లు వేసిన సూరజ్ రికార్డు స్థాయిలో 222 పరుగులు ఇచ్చాడు. అలానే 2025లో గాలే వేదికగా బంగ్లాదేశ్‌తో జరిగిన టెస్టులో తరిందు రత్నాయకే 196 పరుగులు(49.2 ఓవర్లా?) ఇచ్చి రెండో స్థానంలో ఉన్నాడు. 1999లో ధాకా వేదికగా పాకిస్థాన్‌తో టెస్ట్ మ్యాచ్‌లో ఉపుల్ చందన 179 పరుగులు(47.5 ఓవర్లా?) ఇచ్చి మూడో స్థానంలో ఉన్నాడు. తాజాగా కేశర్ 175 పరుగులతో నాలుగో స్థానంలో నిలిచాడు. 2020లో దక్షిణాఫ్రికాతో జరిగిన టెస్టులో వనిందు హసరంగ 171 పరుగులు సమర్పించుకుని ఐదో స్థానంలో నిలిచాడు.

ఆస్ట్రేలియాకు మరో షాక్.. 44వేల డాలర్లే ఫైన్‌తో పాటు పాయింట్ల కోత!



బంగ్లాదేశ్‌తో తొలి టెస్టు మ్యాచ్‌లో ఓటమితో తీవ్ర విమర్శలు ఎదుర్కొంటున్న ఆస్ట్రేలియాకు ఇప్పుడు ఓవర్ రేట్ ఉచ్చు వెంటాడుతోంది. రెండు టెస్టుల సిరీస్‌లో 0-1 తేడాతో వెనుకబడిన ఆసీస్‌పై ఐసీసీ చర్యలు తీసుకోనున్నట్లు తెలుస్తోంది. నిర్ణీత సమయంలో ఓవర్లు పూర్తి చేయకపోవడంతో ఆ జట్టుపై భారీ జరిమానాతో పాటు ప్రపంచ టెస్టు ఛాంపియన్‌షిప్(డబ్ల్యూటీసీ) పాయింట్ల కోత పడే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. డార్విన్ వేదికగా జరిగిన తొలి టెస్టులో ఆస్ట్రేలియా నాలుగో రోజు టీ విరామానికి ముందే ఓటమి పాలైంది. మూడో రోజు ఆ జట్టు 90 ఓవర్లు వేయాల్సి ఉండగా.. కేవలం 86 ఓవర్లే పూర్తి చేసింది. దీంతో ఐసీసీ నిబంధనల ప్రకారం ఆస్ట్రేలియా ఓవర్ రేట్ ఉల్లంఘనకు పాల్పడినట్లయింది. అయితే మ్యాచ్ రిఫరీ దీనిపై తుది నిర్ణయం తీసుకోవాల్సి ఉంది.ఐసీసీ నిబంధనల ప్రకారం సాధారణంగా ఒక రోజులో 90 ఓవర్లు వేయాల్సి ఉంటుంది. అయినప్పటికీ ఆస్ట్రేలియా నాలుగు ఓవర్లు తక్కువగా వేసింది. నిబంధనలు ఉల్లంఘించినట్లు తేలితే.. ఒక్కో ఓవర్ తక్కువగా వేసినందుకు ఆటగాళ్ల మ్యాచ్ ఫీజులో 5 శాతం చొప్పున జరిమానా విధించే అవకాశం ఉంటుంది. ఆస్ట్రేలియా ఆటగాళ్లకు ఒక్కో టెస్టుకు సుమారు 20 వేల డాలర్లు మ్యాచ్ ఫీజుగా లభిస్తుందని సమాచారం. నాలుగు ఓవర్ల లోటుకు ఒక్కో ఆటగాడిపై 4 వేల డాలర్ల జరిమానా పడొచ్చు. తుది జట్టులో ఉన్న 11 మంది ఆటగాళ్లపై కలిపి 44 వేల డాలర్ల జరిమానా పడే అవకాశం ఉంది.ఓవర్ రేట్ నిబంధన ఉల్లంఘనకు కేవలం జరిమానాతోనే సరిపెట్టకుండా.. పరిస్థితులను బట్టి ప్రపంచ టెస్టు ఛాంపియన్‌షిప్ పాయింట్లను కూడా ఐసీసీ తగ్గించే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం ఆస్ట్రేలియా 84 పాయింట్లతో డబ్ల్యూటీసీ పట్టికలో అగ్రస్థానంలో ఉంది. ఒక్కో స్లో ఓవర్‌కు ఒక పాయింట్ కోత పడుతుంది. ఈ లెక్కన నాలుగు ఓవర్లకు నాలుగు పాయింట్ల వరకు కోత పడుతుందని ఐసీసీ వర్గాలు పేర్కొన్నాయి. అయితే ఇతర జట్ల తాజా పాయింట్ల శాతాన్ని బట్టి పట్టికలో ఆస్ట్రేలియా స్థానం మారే అవకాశం ఉంటుంది.

శుభ్‌మన్ గిల్ సింగిల్ హ్యాండ్ క్రేజీ క్యాచ్..



శ్రీలంకతో జరుగుతున్న తొలి టెస్టులో భారత కెప్టెన్ శుభ్‌మన్ గిల్ కళ్లు చెదిరే క్యాచ్‌ను అందుకున్నాడు. మూడో రోజు కుల్‌దీప్ యాదవ్ బౌలింగ్‌లో(16.1 ఓవర్) కమిందు మెండిస్(14) ఇచ్చిన క్యాచ్‌ను గిల్ ఎక్స్‌ట్రా కవర్స్‌లో ఒంటిచేత్తో డైవింగ్ క్యాచ్ అందుకుని అందరినీ ఆశ్చర్యపరిచాడు. దీనికి సంబంధించిన వీడియోలు సోషల్ మీడియాలో తెగ వైరల్ అవుతున్నాయి. కుల్‌దీప్ యాదవ్ వేసిన ఫుల్ లెంగ్త్ బంతిని మెండిస్ ముందుకొచ్చి డ్రైవ్ ఆడబోయాడు. బంతి గాల్లోకి లేచి దూరంగా వెళ్తున్నట్లే కనిపించింది. కానీ అక్కడే కాచుకుని ఉన్న గిల్ బంతి నేలకు తాకడానికి క్షణం ముందు ఒంటిచేత్తో ఎలాంటి పొరపాటు చేయకుండా క్యాచ్ అందుకున్నాడు.ఈ క్యాచ్‌పై టీమిండియా మాజీ క్రికెటర్, కామెంటేటర్ సంజయ్ మంజ్రేకర్ కూడా ప్రశంసలు కురిపించాడు. 'వావ్.. ఇది అసాధ్యం. ఇలాంటి క్యాచ్‌ను గిల్ ఎలా పట్టాడో అర్థం కావడం లేదు. అది అతడి పరిధిలో ఉన్న బంతే కాదు. బ్యాటర్ కూడా ఆ బౌల్ తనకు దూరంగా వెళ్లిపోయిందని భావించి ఉంటాడు. గాలేలో మీరు చూసిన అత్యుత్తమ క్యాచ్‌ల్లో ఇదొకటి' అని మంజ్రేకర్ వెల్లడించాడు.460/9 ఓవర్ నైట్ స్కోర్‌తో మూడో రోజు ఆటను ప్రారంభించిన భారత్.. మరో రెండు పరుగులు జోడించి 462 పరుగులకు ఆలౌటైంది. తొలి ఇన్నింగ్స్ ప్రారంభించిన శ్రీలంక.. స్వల్ప వ్యవధిలోనే 5 వికెట్లు కోల్పోయింది. పీకల్లోతు కష్టాల్లో పడిన లంకను.. నిరోషాన్ డిక్వెల్లా(54×), సోనాల్ దినుశా(51×) కాస్త గాడిలో పెట్టే ప్రయత్నం చేస్తున్నారు. మానవ్ సుతార్ 2, సిరాజ్, కుల్‌దీప్ యాదవ్, జడేజా తలొక వికెట్ తీశారు. ఈ వార్త రాసే సమయానికి భారత్ కంటే శ్రీలంక ఇంకా 277 పరుగుల వెనుకంజలో ఉంది.

'ది హండ్రెడ్' ఛాంపియన్‌గా మాంచెస్టర్ సూపర్ జెయింట్స్

లండన్‌లోని చరిత్రాత్మక లార్డ్స్ మైదానంలో జరిగిన 'ది హండ్రెడ్' పురుషుల టోర్నీ ఫైనల్ పోరులో మాంచెస్టర్ సూపర్ జెయింట్స్ అద్భుత విజయం సాధించింది. డిఫెండింగ్ ఛాంపియన్ ట్రెంట్ రాకెట్స్‌తో జరిగిన తుదిపోరులో ఐదు వికెట్ల తేడాతో గెలుపొంది.. తొలిసారిగా ది హండ్రెడ్ ట్రోఫీని ముద్దాడింది.మ్యాచ్ విషయానికి వస్తే... టాస్ గెలిచి మొదట బ్యాటింగ్ చేసిన ట్రెంట్ రాకెట్ జట్టు నిర్ణీత బంతుల్లో 8 వికెట్ల నష్టానికి 158 పరుగులు చేసింది. ఓపెనర్లు బెన్ డకెట్ (31), ఫిన్ అలెన్ (15) పర్వాలేని అనిపించారు. అలానే మిడిలార్డర్‌లో అన్యూరిన్ డొనాల్డ్ (38), కెప్టెన్ లూయిస్ గ్రెగొరీ (32), మిచెల్ శాంట్నర్ (20 నాటౌట్) రాణించడంతో ఆ జట్టు గౌరవప్రదమైన స్కోరు సాధించగలిగింది. మాంచెస్టర్ బౌలర్లలో స్పిన్నర్ నూర్ అహ్మద్ అద్భుతంగా బౌలింగ్ చేసి 3 వికెట్లు పడగొట్టగా, సోనీ బేకర్ 2 వికెట్లు తీశాడు.అనంతరం లక్ష్య ఛేదనలో మాంచెస్టర్ సూపర్ జెయింట్స్ ఓపెనర్ టిమ్ సీఫెర్ట్ ప్రత్యర్థి బౌలర్లకు చుక్కలు చూపించాడు. కేవలం 38 బంతుల్లోనే 4 ఫోర్లు, 7సిక్సర్లతో 72 పరుగులు సాధించి జట్టు విజయంలో కీలక పాత్ర పోషించాడు. అతనికి తోడుగా పాల్ వాల్టర్ (22), జోస్ బట్లర్ (23), డూప్లూయ్ (27 నాటౌట్) రాణించారు. చివరిలో కాస్త తడబడినప్పటికీ లియామ్ డాసన్ విజయవంతంగా లాంఛనం ముగించడంతో మాంచెస్టర్ జట్టు మరో 2 బంతులు మిగిలి ఉండగానే లక్ష్యాన్ని ఛేదించింది. అద్భుత ప్రదర్శన కనబరిచిన టిమ్ సీఫెర్ట్ 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్', 'ప్లేయర్ ఆఫ్ ది టోర్నమెంట్' అవార్డులు అందుకున్నాడు



నీట్-పీజీ పరీక్ష ఏర్పాట్లు పూర్తి

పరీక్షా కేంద్రంలో కట్టుదిట్టమైన భద్రత

జిల్లా కలెక్టర్ అంకిత్



భద్రాద్రి కొత్తగూడెం ప్రతినిధి ఆగస్టు 17 తెలంగాణ పవర్ : ఆగస్టు 30న జరగనున్న నీట్-పీజీ 2026 పరీక్షకు ఎలాంటి అవకతవకలు లేదా సాంకేతిక అంతరాయాలు జరగకుండా పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ అంకిత్ అధికారులను ఆదేశించారు. అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.

నీట్-పీజీ 2026 పరీక్ష సుజాతానగర్‌లోని అబ్దుల్ కలాం ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నలాజికల్ సైన్సెస్‌లో ఉదయం 9:00 గంటల నుండి మధ్యాహ్నం 12:30 గంటల వరకు నిర్వహించబడుతుంది. జిల్లాలో ఇదే ఏకైక పరీక్షా కేంద్రం కాగా, 100 మంది అభ్యర్థులు హాజరయ్యే అవకాశం ఉంది.

పరీక్షా కేంద్రంలో కట్టుదిట్టమైన భద్రత కల్పించాలని పోలీస్ శాఖను కలెక్టర్ ఆదేశించారు. అభ్యర్థులను కఠినంగా తనిఖీ చేయడం, అనుమానాస్పద కదలికలపై నిఘా అవకతవకలను అరికట్టే చర్యలు తప్పనిసరి. ఎలక్ట్రానిక్ పరికరాలు, ఆభరణాలు, వాటర్ బాటిళ్లు ఇతర నిషేధిత వస్తువులను పరీక్షా కేంద్రంలోకి అనుమతించరాదు.పరీక్ష సమయంలో నిరంతర విద్యుత్ సరఫరా ఉండేలా చూడాలని విద్యుత్ శాఖ అధికారులను ఆదేశించారు. విద్యుత్ సరఫరాను నిరంతరం పర్యవేక్షించడానికి ప్రత్యేక అధికారిని నియమించాలి. ఇంటర్నెట్ కనెక్షన్, సీసీటీవీ కెమెరాలు ఇతర సాంకేతిక సౌకర్యాలను ముందుగానే తనిఖీ చేసి సజావుగా పనిచేసేలా చూడాలి.

పరీక్షా కేంద్రాన్ని ముందుగానే తనిఖీ చేసి ఫర్నిచర్, తాగునీరు, మరుగుదొడ్లు, ఇతర ప్రాథమిక సౌకర్యాలు అందుబాటులో ఉండేలా చూడాలని సుజాతానగర్ తహశీల్దార్‌ను ఆదేశించారు. ఉదయం 8:00 గంటల నుండి మధ్యాహ్నం 1:00 గంటల వరకు పరీక్షా కేంద్రం పరిసరాల్లో సెక్షన్ 163 అమలు చేయబడుతుంది. పరీక్ష సమయంలో సమీపంలోని ఫోటోకాపీ కేంద్రాలు మూసివేయాలి.అభ్యర్థులకు అత్యవసర వైద్య సహాయం అందించడానికి పరీక్షా కేంద్రంలో వైద్య సిబ్బందిని అందుబాటులో ఉంచాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారులను ఆదేశించారు. ప్రథమ చికిత్స కిట్లు, అవసరమైన మందులు మరియు ఓఆర్ఎస్ ప్యాకెట్లు సిద్ధంగా ఉంచాలి.అవకతవకలను నివారించడానికి సిట్టింగ్ స్క్వాడ్ నిరంతర నిఘా ఉంచాలి. సుజాతానగర్ తహశీల్దార్ వి. కృష్ణ ప్రసాద్‌ను డ్యూటీ మేజిస్ట్రేట్‌గా నియమించారు. కొత్తగూడెం ఆర్డీఓ పరీక్షా కేంద్రాన్ని పర్యవేక్షించి, పరీక్ష సమయంలో తనిఖీలు నిర్వహిస్తారు.అబ్దుల్ కలాం ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నలాజికల్ సైన్సెస్ ప్రిన్సిపాల్ బి. శ్రీకాంత్ చీఫ్ సూపరింటెండెంట్‌గా, ఇంటర్మీడియట్ విద్యాధికారి హెచ్. వెంకటేశ్వరరావు పరిశీలకుడిగా వ్యవహరిస్తారు.

అప్పగించిన బాధ్యతలను ప్రతి అధికారి బాధ్యతాయుతంగా మరియు నిర్లక్ష్యం లేకుండా నిర్వర్తించాలని కలెక్టర్ అంకిత్ స్పష్టం చేశారు. విధుల్లో నిర్లక్ష్యం చేసిన అధికారులపై నిబంధనల ప్రకారం క్రమశిక్షణా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

నీట్-పీజీ 2026 పరీక్షను విజయవంతంగా సజావుగా నిర్వహించడానికి పోలీస్, రెవెన్యూ, విద్యుత్, వైద్య మరియు ఆరోగ్య, విద్య, ఎన్ఐసి ఇతర శాఖలు సమన్వయంతో పనిచేయాలని పిలుపునిచ్చారు.ఈ సమావేశానికి అదనపు కలెక్టర్ వేణుగోపాల్, డీఆర్వో పద్మావతి, కొత్తగూడెం ఆర్డీఓ మధు, జిల్లా వైద్య ఆరోగ్య అధికారి డా. టుకారం రాథోడ్, జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి వెంకటేశ్వర్లు, సుజాతానగర్ తహశీల్దార్ కృష్ణ ప్రసాద్, అబ్దుల్ కలాం కళాశాల ప్రిన్సిపాల్ శ్రీకాంత్, పోలీస్ అధికారులు వివిధ శాఖల ప్రతినిధులు హాజరయ్యారు.

సంతోష్ నగర్, IS సదన్‌లో అత్యాధునిక ఆసుపత్రిని ప్రారంభించిన కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి..

రత్నాస్ శాలిని ఉమెన్స్ ఉ చైల్డ్ హాస్పిటల్ ప్రారంభం..!



హైదరాబాద్:-సంతోష్ నగర్, : xూ సదన్‌లో గత 35 సంవత్సరాలుగా మెరుగైన మెటర్నిటీ వైద్య సేవలు అందిస్తున్నామని నిర్వాహకులు తెలిపారు. రత్నాస్ శాలిని హాస్పిటల్, రత్నాస్ శాలిని ఉమెన్స్ ఉ చైల్డ్ హాస్పిటల్‌తో అనుసంధానమై.. అత్యాధునిక వైద్య పరికరాలు, నైపుణ్యం కలిగిన వైద్య బృందంతో 90 పడకల సామర్థ్యంతో కొత్తగా ఆసుపత్రిని ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు.

అతి తక్కువ ఖర్చుతో ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించడమే తమ లక్ష్యమని నిర్వాహకులు తెలిపారు. అత్యాధునిక పరికరాలతో ఏర్పాటు చేసిన ఆసుపత్రిని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి ప్రారంభించారు.

అనంతరం మంత్రి ఆసుపత్రి ప్రాంగణాన్ని కలియతిరిగి పరిశీలించారు.

ప్రజలకు అందిస్తున్న వైద్య సేవలు, అందుబాటులో ఉన్న అత్యాధునిక వైద్య పరికరాల గురించి వైద్యులను అడిగి తెలుసుకున్నారు.

అత్యాధునిక వైద్య పరికరాలతో పాటు నైపుణ్యం కలిగిన వైద్య బృందాన్ని ఏర్పాటు చేసి ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందిస్తున్న ఆసుపత్రి నిర్వాహకులను, వైద్యులను మంత్రి అభినందించారు.

వైద్య దంపతులు డాక్టర్ ఉషా సుంకర, డాక్టర్ కిషోర్ కుమార్ సుంకర గత 35 సంవత్సరాలుగా వైద్య రంగంలో సేవలు అందిస్తున్నారని నిర్వాహకులు తెలిపారు.

ప్రస్తుతం డాక్టర్ ప్రశాంత్ రెడ్డి ఆధ్వర్యంలోని రత్నాస్ శాలిని హాస్పిటల్ గ్రూప్‌తో అనుసంధానమై మరింత మెరుగైన వైద్య సేవలు అందించనున్నట్లు పేర్కొన్నారు.

xూ సదన్‌తో పాటు పరిసర ప్రాంతాల ప్రజలు ఈ వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలని నిర్వాహకులు కోరారు.

కార్యక్రమంలో సీనియర్ ఫిజీషియన్ డాక్టర్ మహ్మద్ హత ఉల్లా, వైద్యులు, ఆసుపత్రి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాలను ఎత్తివేసే కుట్ర

పోశం నరసింహారావు



భద్రాద్రి కొత్తగూడెం ప్రతినిధి ఆగస్టు 17 తెలంగాణ పవర్ : భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మణుగూరు పేద, మధ్యతరగతి కుటుంబాలకు అండగా నిలిచిన కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాలను నిర్వీర్యం చేసే దిశగా ప్రభుత్వం అడుగులు వేస్తోందని మాజీ జడ్పీటీసీ, బీఆర్ఎస్ నాయకులు పోశం నరసింహారావు ఆరోపించారు. సోమవారం టిఆర్ఎస్ పార్టీ మణుగూరు టౌన్ మాజీ అధ్యక్షుడు కుంట లక్ష్మణ్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న పొషం నరసింహ రావు మాట్లాడుతూ పేద ఆడబిడ్డల వివాహాలకు ఆర్థిక భరోసా కల్పించేందుకు మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను కొనసాగించాల్సిన బాధ్యత ప్రస్తుత ప్రభుత్వంపై ఉందన్నారు.

పెళ్లయిన నూతన వధువులకు తులం బంగారం అందిస్తామని ఇచ్చిన హామీ ఏమైందని ఆయన ప్రశ్నించారు. పథకాలపై స్పష్టత ఇవ్వకుండా లబ్ధిదారులను అయోమయానికి గురిచేయడం సరికాదన్నారు.

కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాల అమలుపై న్యాయస్థానం ఆదేశాలు ఉన్నప్పటికీ ప్రభుత్వం సమగ్రంగా కౌంటర్ దాఖలు చేయడంలో నిర్లక్ష్యం వహిస్తోందని నరసింహారావు విమర్శించారు. కోర్టు ఆదేశాలను గౌరవించి పేద కుటుంబాలకు న్యాయం జరిగేలా ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

"కేసీఆర్ ప్రవేశపెట్టిన పథకాలను రాజకీయ కక్షతో నిలిపివేసే ప్రయత్నం చేయడం పేదలపై భారాన్ని మోపడమే. ఆడబిడ్డల వివాహాలకు అండగా నిలిచే కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాలను ఎట్టి పరిస్థితుల్లోనూ నిర్వీర్యం చేయకూడదు. తులం బంగారం హామీతో పాటు పెండింగ్‌లో ఉన్న లబ్ధిదారుల సమస్యలను వెంటనే పరిష్కరించాలి" అని పోశం నరసింహారావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

పథకాల భవిష్యత్తుపై ప్రభుత్వం తక్షణమే స్పష్టమైన ప్రకటన చేయాలని, అర్హులైన ప్రతి లబ్ధిదారుడికి పథకం ప్రయోజనం అందేలా చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. ఈమేరకు తహశీల్దార్ కార్యాలయంలో ఆందోళన చేపట్టి మణుగూరు తాహసిల్దార్ నరేష్ కు వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో ఎడ్ల శ్రీను,అడపా అప్పారావు, వట్టం రాంబాబు, యాదగిరి గౌడ్,ముద్దంగుల కృష్ణ,దర్శనాల శ్రీనివాస్, జావీద్ పాష,చెన్నకేశవులు,అక్కి నరసింహారావు,ప్రభుదాస్,పప్పుల ప్రసాద్,చంద్రకళ, అడబాల సత్యవతి, ఏనిక ప్రసాద్, , సర్పంచ్ స్వరూప, రజిత, జ్యోతి, వేల్పుల సురేష్, బోసెట్టి రవి, బుద్దుల ప్రసాద్, తురక రామకోటి, వావిలాల నరసయ్య, కంభంపాటి శ్రీను,ఆవుల శ్రీను, స్వర్ణలత,సరోజనమ్మ, జ్యోత్స్న, గుగులోత్ భాస్కర్, యగ్గడి నరసింహారావు, రంజిత్, వార్డు మెంబర్స్ పాష, శారద, పద్దం శ్రీను, వడ్లూరి రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల భవిష్యత్తే లక్ష్యంగా అభివృద్ధి

ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు



భద్రాద్రి కొత్తగూడెం ప్రతినిధి ఆగస్టు 17 తెలంగాణ పవర్ : మణుగూరు మండలం సమితి సింగారంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల అభివృద్ధికి పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు పెద్దపీట వేస్తున్నారు. కళాశాల ప్రాంగణాన్ని మరింత సౌకర్యవంతంగా తీర్చిదిద్దేందుకు రూ.15 లక్షలతో చేపట్టనున్న గ్రౌండ్ లెవలింగ్ పనులకు సోమవారం ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు భూమి పూజ నిర్వహించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడంతో పాటు మెరుగైన మౌలిక వసతులు, ఆహ్లాదకరమైన విద్యా వాతావరణం కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. కళాశాల అభివృద్ధికి అవసరమైన పనులను ప్రాధాన్యత క్రమంలో చేపడుతున్నామని పేర్కొన్నారు.

గ్రౌండ్ లెవలింగ్ పనులు పూర్తయితే కళాశాల ప్రాంగణం మరింత సౌకర్యవంతంగా మారుతుందని, విద్యార్థులకు క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాలు, ఇతర విద్యా కార్యక్రమాలు నిర్వహించేందుకు అనుకూలంగా ఉంటుందని ఎమ్మెల్యే తెలిపారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాల అభివృద్ధికి అవసరమైన మౌలిక వసతుల కల్పనకు తన వంతు కృషి చేస్తానని పాయం వెంకటేశ్వర్లు హామీ ఇచ్చారు. గ్రామీణ ప్రాంత విద్యార్థులకు ఉన్నత విద్య అందుబాటులో ఉండేలా కళాశాలలను అన్ని విధాలుగా అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉందన్నారు.విద్యార్థుల భవిష్యత్తే లక్ష్యంగా అభివృద్ధి విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని కళాశాలలో మౌలిక వసతులను మెరుగుపరచడం ద్వారా వారికి మెరుగైన విద్యా వాతావరణం కల్పించవచ్చని నాయకులు పేర్కొన్నారు. రూ.15 లక్షలతో చేపడుతున్న గ్రౌండ్ లెవలింగ్ పనులు పూర్తయిన తర్వాత కళాశాల ప్రాంగణం రూపురేఖలు మరింత మెరుగుపడనున్నాయి.

ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు, కళాశాల అధ్యాపకులు, మండల అధ్యక్షులు, టౌన్ అధ్యక్షులు, జిల్లా ముఖ్య నాయకులు, సర్పంచులు, ఉపసర్పంచులు, వార్డు సభ్యులు, మైనారిటీ అధ్యక్షులు, మహిళా అధ్యక్షురాలు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, మహిళా నాయకులు, కళాశాల సిబ్బంది, విద్యార్థులు, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు

రామచంద్రరావును కలిసిన జిల్లా నేతలు



మెట్‌పల్లి, ఆగస్టు 17 (తెలంగాణ పవర్): భారతీయ జనతా పార్టీ రాష్ట్ర అధ్యక్షులు రామచంద్రరావును హైదరాబాద్‌లోని పార్టీ రాష్ట్ర కార్యాలయంలో జగిత్యాల జిల్లా బీజేపీ నేతలు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా జిల్లాలో పార్టీ బలోపేతం, భవిష్యత్ కార్యాచరణపై నేతలు చర్చించారు. ఈ సమావేశంలో జగిత్యాల జిల్లా బీజేపీ అధ్యక్షులు రాచకొండ యాదగిరి బాబు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు డాక్టర్ అనుప్ రావు, పూదరి అరుణ, మెట్‌పల్లి పట్టణ అధ్యక్షులు ధోనీకేల నవీన్, కోరుట్ల పట్టణ అధ్యక్షులు కస్తూరి లక్ష్మీనారాయణ, మల్లాపూర్ మండల అధ్యక్షులు గోపిడి శ్రీనివాస్ రెడ్డి పాల్గొన్నారు. పార్టీ నేతలు, కార్యకర్తలు అందరూ సమన్వయంతో పనిచేస్తూ పార్టీని మరింత బలోపేతం చేయాలని రాష్ట్ర అధ్యక్షుడు రామచంద్రరావు సూచించారు. పార్టీ క్రమశిక్షణను ఉల్లంఘించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని, పార్టీ వ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడితే సహించేది లేదని స్పష్టం చేసినట్లు నేతలు తెలిపారు. అలాగే బూత్ స్థాయి నుంచి పార్టీని బలోపేతం చేయాలని, కాంగ్రెస్ ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలపై ప్రజల్లో అవగాహన కల్పిస్తూ ఆందోళన కార్యక్రమాలను చేపట్టాలని ఆయన పిలుపునిచ్చినట్లు తెలిపారు.

ఫ్రంట్ లైన్ సుపెర్వైజర్లు ముందు చూపుతో వ్యవహరించాలి

డి వెంకట రామారావు



భద్రాద్రి కొత్తగూడెం ప్రతినిధి 17 తెలంగాణ పవర్ : మణుగూరు ఏరియా యం వి టి సి లో సింగరేణి కాలరీస్ కంపెనీకి చెందిన ఫ్రంట్లైన్ సూపర్వైజర్ల కోసం నిర్వహిస్తున్న శిక్షణ తరగతులు సోమవారం ప్రారంభమయ్యాయి. 17.ఆగస్టు 2026 నుండి 29.ఆగస్ట.2026 వరకు రెండు వారాల పాటు ఈ శిక్షణ కార్యక్రమం కొనసాగనుంది.ఈ శిక్షణ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఇన్చార్జ్ జనరల్ మేనేజర్ డి. వెంకట రామారావు శిక్షణ తరగతులను ప్రారంభించి మాట్లాడుతూ...ఫ్రంటైన్ సూపర్వైజర్ల విధి నిర్వహణ ఎంతో బాధ్యతతో కూడుకున్నదని అన్నారు. గనుల్లో, యంత్రాల మధ్య పనిచేసే కార్మికులు సరైన రక్షణ పరికరాలు ధరించకపోయినా, భద్రతా నిబంధనలకు విరుద్ధంగా పనిచేస్తున్నా ఎట్టి పరిస్థితుల్లోనూ రాజీ పడకూడదని సూచించారు. భద్రతా ప్రమాణాలను నిర్లక్ష్యం చేస్తే జరిగే పరిణామాలపై కార్మికులకు అవగాహన కల్పించి, సురక్షిత విధానాలను పాటించేలా వారిని ప్రోత్సహించడం ఫ్రంట్‌అన్ సూపర్వైజర్ల ప్రధాన బాధ్యతగా భావించాలన్నారు. ఫ్రంటైన్ సూపర్వైజర్లు ముందుచూపుతో వ్యవహరిస్తూ, పని ప్రదేశాలను నిశితంగా పరిశీలించాలని డి. వెంకట రామారావు సూచించారు. ప్రమాదాలకు ఆస్కారం ఉన్న ప్రాంతాలను ముందుగానే గుర్తించి, వెంటనే తగిన చర్యలు చేపట్టడం ద్వారా ప్రమాదాలను నివారించడంలో వారు కీలక పాత్ర పోషించాలన్నారు.ఏరియాలోని పని ప్రదేశాల్లో భద్రతా చర్యలను పకడ్బందీగా అమలు చేస్తున్నప్పటికీ, ప్రమాదం ఎప్పుడు, ఏ రూపంలో సంభవిస్తుందో చెప్పలేమన్నారు. ఒకరి అజాగ్రత్త అనేక మందిని ప్రమాదానికి గురిచేయవచ్చని, అదే విధంగా ఒకరి అప్రమత్తత ఎంతోమందిని ప్రమాదం నుంచి కాపాడగలదని పేర్కొన్నారు. రెండు వారాల పాటు నిర్వహించనున్న ఈ భద్రతా శిక్షణ ద్వారా ఫ్రంట్‌అన్ సూపర్వైజర్లు తమ అవగాహనను మరింత పెంపొందించుకోవాలని, తమ వృత్తిపరమైన అనుభవాన్ని ఉపయోగించి కార్మికుల్లో భద్రతా చైతన్యాన్ని పెంచాలని డి. వెంకట రామారావు సూచించారు. పని ప్రదేశాల్లో ప్రమాదాలకు దారితీసే పరిస్థితులను ముందుగానే గుర్తించి, వెంటనే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లడం ద్వారా ప్రమాదాలను నివారించేందుకు కృషి చేయాలని అన్నారు.ఈ కార్యక్రమంలో ఏజీఎం (పర్సనల్) ఎస్. రమేష్, ఏఐటీయూసీ బ్రాంచ్ సెక్రటరీ వై. రాంగోపాల్, ఐఎన్టీయూసీ వైస్ ప్రెసిడెంట్ వి. కృష్ణంరాజు, సీఎంఓఏఐ జనరల్ సెక్రటరీ వి. మధన్ నాయక్, ఏరియా రక్షణ అధికారి రామన్ వి. పాఠక్,యం వి టి సి మేనేజర్ జి. నాగేశ్వరరావు,ఎస్ ఇ (ఎస్ యం యం సి) బి. బాబ్లీ తో పాటు ఫ్రంటైన్ సూపర్వైజర్లు పాల్గొన్నారు.

సినిమా

ఇక సినిమాల్లో అవకాశాలు రావనుకున్నా



నటి సమంత 'మా ఇంటి బంగారం'తో విజయాన్ని సొంతం చేసుకున్నారు. తాజాగా ఒక ఇంటర్వ్యూలో మాట్లాడుతూ.. యాక్షన్ సినిమాల్లో నటించడం అంత సులభమైన విషయం కాదన్నారు. సొంతంగా సినిమాలు నిర్మించడంపై ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. నిర్మాణ రంగం తనకిచ్చిన సృజనాత్మక స్వేచ్ఛ.. నటన ఇవ్వలేదని తెలిపారు. మయోసైటిస్ వచ్చిందని తెలిసినప్పుడు ఓ ఆలోచన నన్ను కలవరపెట్టింది. ఇక సినిమాలోకి తీసుకోవడానికి నిర్మాతలు ఆలోచిస్తారేమోనని భయపడ్డాను. కానీ, ఇప్పుడు నేనే నిర్మాణ సంస్థను ఏర్పాటు చేసి సినిమాలు నిర్మిస్తున్నాను. వరుస ప్రాజెక్ట్‌లతో బిజీగా ఉన్నాను. చిత్ర పరిశ్రమలో కొనసాగుతూనే కెమెరా ముందు కాకుండా వెనక కూడా నాకు నచ్చిన పనులు చేస్తున్నాను' అని అన్నారు. యాక్షన్ పాత్రల గురించి సమంత మాట్లాడుతూ, 'ది ఫ్యామిలీ మ్యాన్, సిటాడెల్: హనీ బన్నీ సిరీస్‌లలో నేను చేసిన యాక్షన్ సీన్లకు మంచి స్పందన రావడం ఆశ్చర్యాన్ని కలిగించింది. అమ్మాయిలు యాక్షన్ సన్నివేశాలు చేస్తే ప్రేక్షకులు అంత సులభంగా అంగీకరించరు. ఆ ధోరణిని తీసివేయాలనుకుంటున్నా. హీరోయిన్స్ కూడా అన్ని చేయగలరని నిరూపించాలని అనుకుంటున్నా. సినిమాలో దెబ్బలు తింటూ, ఫైట్స్ చేయడం నాకెంతో ఉత్సాహాన్నిస్తుందని పేర్కొన్నారు.




అసభ్యకరమైన పోస్టులు తొలగించండి




జాన్వీ కపూర్ పిటిషన్‌పై కోర్టు ఆదేశం ,ప్రముఖ బాలీవుడ్ నటి జాన్వీ కపూర్ తన వ్యక్తిత్వ హక్కుల పరిరక్షణ కోసం ఢిల్లీ హైకోర్టును ఆశ్రయించారు. తన పేరు, ఫొటోలు, వీడియోలను అడ్డుపెట్టుకుని సోషల్ మీడియాలో అసభ్యకరమైన పోస్టులు, ఎఐ ద్వారా సృష్టించిన డీప్‌ఫేక్ వీడియోలను ప్రచారం చేస్తున్నారని ఆమె తరఫు న్యాయవాది కోర్టులో వాదించారు. అయితే ఈ పిటిషన్‌పై విచారణ జరిపిన ఢిల్లీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ అనూప్ జైరామ్ భంభాని కీలక ఆదేశాలు జారీ చేశారు. అసభ్యకరంగా ఉన్న కంటెంట్‌ను, అలాగే ఎవరైనా ఆమె పేరును వాణిజ్యపరంగా దుర్వినియోగం చేస్తుంటే ఆ పోస్టులను తక్షణమే తొలగించాలని స్పష్టం చేశారు.ఈ సందర్భంగా న్యాయమూర్తి మాట్లాడుతూ.. పర్సనాలిటీ రైట్స్ అనే భావనకు ఒక సరైన హద్దు ఉండాలని, సెలబ్రిటీల హక్కులను రక్షించడంతోపాటు భావప్రకటన స్వేచ్ఛను కూడా సమతుల్యం చేయాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. ఈ సందర్భంగా అన్ని ఫ్యాన్ పేజీలపై ఒకేసారి నిషేధం విధించలేమని కోర్టు పేర్కొంది. కేవలం వాణిజ్య ప్రయోజనాల కోసం లేదా డబ్బు సంపాదనే లక్ష్యంగా ఎవరైనా ఆమె పేరును వాడుకుంటేనే కచ్చితంగా చర్యలు తీసుకోవచ్చునని, అయితే అన్ని ఫ్యాన్ పేజీలను నేరపూరితమైనవిగా పరిగణించలేమని తెలిపారు. కొందరు వ్యంగ్యంగా లేదా విమర్శనాత్మక ధోరణిలో కూడా పోస్టులు చేసే అవకాశం ఉందని న్యాయమూర్తి గుర్తుచేశారు. ఈ కేసులో మెటా తరఫు న్యాయవాది వాదనలు వినిపిస్తూ.. పిటిషనర్ తరఫున ఇప్పటికే 4,000కు పైగా యూఆర్ఎల్‌లను సమర్పించారని, అయితే ఆ కంటెంట్ అంతా ఒకేలా అభ్యంతరకరంగా లేదని కోర్టు దృష్టికి తెచ్చారు. దీంతో, ఆరోపణలు ఎదుర్కొంటున్న కంటెంట్‌ను స్పష్టమైన వర్గాలుగా విభజించి తదుపరి విచారణకు కోర్టు ముందుంచాలని పిటిషనర్ తరఫు న్యాయవాదిని న్యాయమూర్తి ఆదేశించారు. గతంలో కూడా పలువురు ప్రముఖ నటీనటులు, క్రీడాకారులు, రాజకీయ నాయకులు తమ వ్యక్తిత్వ హక్కుల రక్షణ కోసం ఢిల్లీ హైకోర్టును ఆశ్రయించిన విషయం తెలిసిందే.

4న వస్తోన్న క్రైమ్ థ్రిల్లర్ మీర్జాపూర్ మూవీ



భారతీయ ఓటీటీ చరిత్రలో సంచలనం సృష్టించడంతో పాటు అత్యంత ప్రజాదరణ పొందిన క్రైమ్ డ్రామా వెబ్ సిరీస్ 'మిర్జాపూర్' ఇప్పుడు వెండితెరపై అలరించేందుకు సిద్ధమైంది. అమెజాన్ ఎమ్‌జీఎం స్టూడియోస్ మరియు ఎక్సెల్ ఎంటర్‌టైన్‌మెంట్ పతాకాలపై రితేష్ సిధ్వాని, ఫర్హాన్ అక్తర్ సంయుక్తంగా ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. సెప్టెంబర్ 4న ఈ సినిమా ప్రేక్షకుల ముందుకు రాబోతుండగా తాజాగా ఈ సినిమాకు సంబంధించిన అధికారిక ట్రైలర్ విడుదల చేశారు మేకర్స్. ఈ చిత్రానికి గుర్మీత్ సింగ్ దర్శకత్వం వహిస్తుండగా, సిరీస్‌లో అదరగొట్టిన ప్రధాన నటీనటులందరూ మళ్లీ పెద్ద తెరపై తమ విశ్వరూపం చూపించడానికి వస్తున్నారు. 'సింహాసనం అనేది రాజకీయాల ద్వారా రాదు, అలా అని వంశపారంపర్యంగానూ రాదు? కేవలం బాహుబలం ఉంటేనే సింహాసనం దక్కుతుంది అనే పవర్‌ఫుల్ డైలాగ్‌తో ట్రైలర్ ఆకట్టుకుంటుంది. ఓటీటీలో వెబ్ సిరీస్‌గా ప్రేక్షకులను అలరించిన ఈ నేర ప్రపంచాన్ని, మరింత భారీ హంగులతో, అత్యున్నత నిర్మాణ విలువలతో వెండితెర కోసం మలిచారు. గతంలో సిరీస్‌లో మరణించినట్లు చూపించిన మున్నా భయ్యా (దివ్యేందు) పాత్ర ఈ చిత్రంలో మళ్లీ రీఎంట్రీ ఇస్తుండటం అభిమానులకు అసలైన విందుగా మారనుంది. ఇక మిర్జాపూర్ సింహాసనం కోసం జరిగే పోరులో కాలీన్ భయ్యా (పంకజ్ త్రిపాఠి), గుడ్డూ పండిట్ (అలీ ఫజల్) మరియు మున్నా భయ్యా మధ్య జరిగే రక్తపాతంతో కూడిన పోరాటం ట్రైలర్‌లో ప్రధాన ఆకర్షణగా నిలిచింది. ఈ చిత్రంలో పంకజ్ త్రిపాఠి, అలీ ఫజల్, దివ్యేందులతో పాటు శ్వేతా త్రిపాఠి, రసికా దుగ్గల్, అభిషేక్ బెనర్జీ, జితేంద్ర కుమార్, రవి కిషన్ మరియు పలువురు ప్రముఖ నటీనటులు కీలక పాత్రల్లో నటిస్తున్నారు.

మళయాళంలోనూ ఎంట్రీ ఇచ్చిన రుక్మిణీ వసంత్



కన్నడ సినీ పరిశ్రమ నుంచి వచ్చి, సౌత్ ఇండియా మొత్తాన్ని తన నటనతో, క్యూట్ లుక్స్‌తో ఆకట్టుకుంటోంది రుక్మిణీ వసంత్. ఇప్పటికే కన్నడ, తమిళం, హిందీ ప్రాజెక్టులతో బిజీగా ఉన్న ఈ భామ ఇప్పుడు మలయాళ చిత్రసీమలోకి అడుగుపెడుతోంది. మలయాళ స్టార్ హీరో నివిన్ పౌలీ సరసన కథానాయికగా రుక్మిణి ఎంపికైంది. 'జయ జయ జయ జయ హే' వంటి సెన్సేషనల్ హిట్‌ను అందించిన దర్శకుడు నషిద్ ఫామి ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. ఒక్క మలయాళం మాత్రమే కాదు ప్రస్తుతం సౌత్ లోని బడా ప్రాజెక్టులన్నీ రుక్మిణీ వసంత్ డైరీలోనే ఉన్నాయి. రాకింగ్ స్టార్ యశ్ హీరోగా తెరకెక్కుతున్న అత్యంత ప్రతిష్టాత్మక పాన్-ఇండియా చిత్రం 'టాక్సిక్' లో రుక్మిణి కీలక పాత్ర పోషిస్తోంది. దీనికి తోడు టాలీవుడ్‌లో యంగ్ టైగర్ ఎన్టీఆర్, సెన్సేషనల్ డైరెక్టర్ ప్రశాంత్ నీల్ కాంబినేషన్‌లో వస్తున్న 'డ్రాగన్' మూవీలోనూ రుక్మిణి కథానాయికగా నటిస్తోంది. ఈ బ్యాక్-టు-బ్యాక్ పాన్ ఇండియా ప్రాజెక్టులతో రుక్మిణీ వసంత్ రేంజ్ ఒక్కసారిగా మారిపోయింది. ఇదిలా ఉంటే ఇప్పుడు టాలీవుడ్ వర్గాల్లో మరో మైండ్ బ్లోయింగ్ న్యూస్ హల్‌చల్ చేస్తోంది. రామ్ చరణ్, డైరెక్టర్ సుకుమార్ కాంబినేషన్‌లో వస్తోన్న మోస్ట్ క్రేజీ ప్రాజెక్ట్ లో కథానాయికగా రుక్మిణీ వసంత్ పేరును పరిశీలిస్తున్నట్లు వార్తలు వినిపిస్తున్నాయి.

మిస్సింగ్ మేఘన..పిల్లపిల్ల పిల్ల సాంగ్ రిలీజ్

టాలీవుడ్ చలనచిత్ర పరిశ్రమలో ప్రయోగాత్మక చిత్రాలతో పాటు సరికొత్త కథాంశాలతో ప్రేక్షకులను అలరించేందుకు వస్తోన్న తాజా థ్రిల్లర్ చిత్రం 'మిస్సింగ్ మేఘన'. ఫస్ట్ కాపి మూవీస్ మరియు కేడి / కో సంయుక్త బ్యానర్లపై పంచుమర్తి నరేష్ బాబు నిర్మాతగా వ్యవహరిస్తోన్న ఈ చిత్రానికి వాచస్పతి దర్శకత్వం వహిస్తున్నారు. రామ్ కార్తీక్ హీరోగా నటిస్తున్న ఈ సినిమాలో అమ్ము అభిరామి, వైదిక సెంజాలియా, అంకిత్ కొయ్య తదితరులు ప్రధాన పాత్రల్లో నటిస్తున్నారు. తాజాగా ఈ చిత్రానికి సంబంధించిన ప్రమోషన్ కార్యక్రమాలు మరింత జోరందుకున్నాయి. సినిమాలోని ఫస్ట్ సింగిల్ అయిన 'పిల్ల పిల్ల పిల్ల' లిరికల్ సాంగ్ లాంచ్ ఈవెంట్‌ను టాలీవుడ్ ప్రముఖ లెజెండరీ ప్రొడ్యూసర్ సురేష్ బాబు ప్రారంభించారు. రామానాయుడు స్టూడియోస్‌లో జరిగిన ఈ వేడుకకు నైపుణ్యం కలిగిన సినీ ప్రముఖులు, చిత్ర యూనిట్ సభ్యులు మరియు నిర్మాత బెక్కం వేణుగోపాల్ హాజరయ్యారు. సురేష్ బాబు తన గో÷-డలెన్ హ్యాండ్‌తో పాటను విడుదల చేసి చిత్ర బృందానికి ఘన విజయం సాధించాలని అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా దర్శకుడు వాచస్పతి మాట్లాడుతూ, సురేష్ ప్రొడక్షన్స్ కి ఇండియన్ ఫిల్మ్ ఇండస్ట్రీలో ఉన్న ప్రత్యేక స్థానం గురించి కొనియాడారు. తమ సినిమా ఫస్ట్ సాంగ్ సురేష్ బాబు గారి చేతుల మీదుగా లాంచ్ కావడం ఎంతో ఆనందంగా ఉందని, నన్ను నమ్మి అవకాశం కల్పించిన నిర్మాత నరేష్ బాబుకు, కో-ప్రొడ్యూసర్ శ్రీనివాస్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ చిత్రంలో అద్భుతమైన పాటలు అందించిన సంగీత దర్శకుడు ఆర్.ఆర్. ధ్రువన్‌కు మరియు ఈ పాటకు ప్రాణం పోసిన ప్రముఖ గాయకుడు జావేద్ అలీకి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. నిర్మాత నరేష్ బాబు మాట్లాడుతూ, తమ సినిమా ప్రారంభోత్సవం కూడా రామానాయుడు స్టూడియోలోనే జరిగిందని, ఇప్పుడు అదే స్టూడియోలో లెజెండరీ ప్రొడ్యూసర్ సురేష్ బాబు చేతుల మీదుగా మొదటి పాట విడుదల కావడం సెంటిమెంట్‌గా చాలా సంతోషాన్నిస్తోందన్నారు. గతంలో వచ్చిన 'తంత్ర' సినిమా మ్యూజికల్ ఎంతటి విజయం సాధించిందో, ఈ సినిమా సంగీతం మరియు కథ కూడా అంతకంటే గొప్ప విజయాన్ని అందుకుంటాయని ఆయన ధీమా వ్యక్తం చేశారు. సంగీత దర్శకుడు ఆర్.ఆర్. ధ్రువన్ మాట్లాడుతూ, ఈ బ్యానర్‌లో తాను చేస్తున్న రెండవ సినిమా ఇదనీ, తానే స్వయంగా పాట రాసి, సంగీతం అందించి, తన ఫేవరెట్ సింగర్ జావేద్ అలీతో పాడించడం మరపురాని అనుభూతి అని తెలిపారు. చక్కని థ్రిల్లర్ అంశాలతో రూపొందిన ఈ చిత్రం ప్రేక్షకులందరినీ ఖచ్చితంగా అలరిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ చిత్రంలో గోపరాజు రమణ, వెంప కాశి, కౌశిక్, మహిపాల్, రుచిత, నళిని, శ్రీనివాస్, అజీమ్, పండు తదితరులు ఇతర కీలక పాత్రల్లో నటిస్తున్నారు.



Edited, Printed, Published and Owned by NASREEN KHAN , Printed at M/s DATTASAI GRAPHICS :1-1-651/8, Gandhi Nagar, Hyderabad-500 080
Published from H.No.1-7-137, Flat 402, Vijaysai Apartments, Zamistanpur, Musheerabad, Hyderabad- 20, (Telangana) Editor:Nasreen Khan, Ph : 040-27602786, Cell : 965243981 .R.N.I.No.TELTEL/2013/51844